GIRDHARI, RNI Regn.No.TELTEL/2021/80612, Date of Pub - 25th of every month
Date posting - 1st of every month at BPC-IV, Patrika Channel, HYD - 01
Postal Regn.No.HQ/SD/525/2024-2026; Licensed to Post without prepayment
WPP No.PMG/TS/HQR/SC-04/WPP/2024-2026



మోక్షధామం పున: ప్రారంభం





Edited, printed, published and owned by Swami Sundara Chaitanyananda, Printed at M/s Karshak Print Solutions Pvt. Ltd., Moula Ali, Hyd - 500 040.

IF UNDELIVERED PLEASE RETURN TO :
SUNDARA CHAITANYA ASHRAM
HYDERABAD - 500 043

గిరిధారి

మార్చి 2026


శాశ్వత చందా రూ.1200/-
10 సం॥ లకు



రామో విగ్రహవాన్ ధర్మః

హైదరాబాద్ - సుందర చైతన్యాశ్రమంలో
శ్రీరామాలయ నిర్మాణానికి విరాళములు సమర్పించిన భక్తులు


శ్రీ ఎమ్.లింబాద్రి
మెట్‌పల్లి
రూ.1,11,111/-
(లక్ష పదకొండు వేల నూట పదకొండు)


శ్రీమతి ఎస్.కస్తూరి
లండన్
రూ.50,000/-
(యాభై వేలు)


శ్రీ లక్ష్మీకాంతరావు
మహబూబ్‌నగర్
రూ.30,000/-
(ముప్పై వేలు)


శ్రీ ఎమ్.సుబ్రహ్మణ్యం
హైదరాబాద్
రూ.30,000/-
(ముప్పై వేలు)


కుమారి జి.హరిచందన
హైదరాబాద్
రూ.30,000/-
(ముప్పై వేలు)


శ్రీమతి ఎ.జయంతి
హైదరాబాద్
రూ.30,000/-
(ముప్పై వేలు)


శ్రీమతి ఎమ్.సత్యవతి
హైదరాబాద్
రూ.25,000/-
(ఇరవై ఐదు వేలు)



శ్రీ కె.కృష్ణ
హైదరాబాద్
రూ.25,000/-
(ఇరవై ఐదు వేలు)


శ్రీమతి కె.సుస్మిత
హైదరాబాద్
రూ.25,000/-
(ఇరవై ఐదు వేలు)



శ్రీమతి డి.విజయలక్ష్మి
హైదరాబాద్
రూ.25,000/-
(ఇరవై ఐదు వేలు)


శ్రీమతి పి.నీలిమ
హైదరాబాద్
రూ.25,000/-
(ఇరవై ఐదు వేలు)


శ్రీ ఆర్.శ్రీనివాస్
హైదరాబాద్
రూ.25,000/-
(ఇరవై ఐదు వేలు)


శ్రీ జి.వి.రమణారెడ్డి
హైదరాబాద్
రూ.25,000/-
(ఇరవై ఐదు వేలు)


డా॥ శ్రీమతి ఎ.లక్ష్మీ ప్రసన్న
చిత్తూరు
రూ.25,000/-
(ఇరవై ఐదు వేలు)



శ్రీమతి కె.రేణుక
శ్రీ కె.సందీప్, చి॥ సహస్ర
కడప, రూ.25,116/-
(ఇరవై ఐదు వేల నూట పదహారు)


శ్రీమతి జి.శ్రీదేవి
శ్రీ జి.భాస్కర్ రావు
హైదరాబాద్
రూ.25,000/-
(ఇరవై ఐదు వేలు)


శ్రీ వై.రమణా రెడ్డి
హైదరాబాద్
రూ.25,000/-
(ఇరవై ఐదు వేలు)


శ్రీమతి డి.మాధవి
శ్రీ డి.భిక్షపతి
హైదరాబాద్
రూ.25,000/-
(ఇరవై ఐదు వేలు)


శ్రీ జి.భిక్షపతి
హైదరాబాద్
రూ.25,000/-
(ఇరవై ఐదు వేలు)


డా॥ శ్రీ వి.చంద్రశేఖరం
వైజాగ్
రూ.25,000/-
(ఇరవై ఐదు వేలు)

ప్రార్థన





శ్లో॥ జన్మాదౌ క్రతు రక్షణం మునిపతే స్థాణో ర్ధనుర్భంజనం
వైదేహీ గ్రహణం పితుశ్చ వచనా ద్ఘోరాటవీ గాహనమ్ ।
కోదండ గ్రహణం ఖరాది మథనం మాయామృగచ్ఛేదనం
బద్ధాబ్ధి క్రమణం దశాస్య నిధనం చైతద్ధి రామాయణమ్॥

రాముడు జన్మించుట, విశ్వామిత్రుని యాగమును రక్షించుట, అహల్యను ఉద్ధరించుట, శివ ధనుస్సును విరుచుట, జానకిని పరిణయమాడుట, తండ్రి ఆజ్ఞానుసారము భయంకరమైన అరణ్యమున కేగుట, కోదండధారియై ఖరుడు మొదలైన రాక్షసులను వధించుట, మాయలేడిని సంహరించుట, వారధిని నిర్మించి సాగరమును దాటుట, దశకంఠుడైన రావణుని వధించుట - ఇదియే సంక్షిప్త రామాయణము.



పండుగలు

3-3-2026 - హోళి
19-3-2026 - ఉగాది
27-3-2026 - శ్రీరామ నవమి

సంపుటి : 41 సంచిక : 4

వ్యవస్థాపకులు :
శ్రీ స్వామి సుందర చైతన్యానంద

సంపాదకులు : శ్రీ స్వామి సుందర చైతన్యానంద

ఇందులో

ప్రార్థన	3
విషయ సూచిక	4
ఆప్తవాక్యం	5
అందాల హరివిల్లు నీ ఇల్లు	8
శ్రీకృష్ణ కథాగానం	11
మహిష్మతిలో శంకరయతి	15
ఓ కథ చెప్పనా!	18
చతుర్విధ పురుషార్థములు	19
చైతన్య రామాయణము	24
నా సమస్యకు పరిష్కారం నేనే	31
ఆసక్తికరమైన లేఖ	34
స్వామీజీ సమాధానం	35
సందేహాలు - సమాధానాలు	37
చైతన్య ప్రభంజనం	40


జీవిత సభ్యత్వం - రూ. 1200 /-
(10 సంవత్సరములు)

డి.టి.పి. & కవర్ డిజైన్
సుందర చైతన్యాశ్రమం, హైదరాబాద్

ప్రింటింగు : బైండింగు
కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్, హైదరాబాద్

వివరములకు : సుందర చైతన్యాశ్రమం,
దుండిగల్ రోడ్, హైదరాబాద్ - 500 043. ఫోన్:(08418)255777, 9100908777

Visit us at : www.sundarachaitanyam.com (email : admin@sundarachaitanyam.org)



ఆప్తవాక్యం

దాసోహం

ప్రభూ!
నేను నీవు కాకపోతే
నీవు నాకు లేకపోతే - నా బ్రతుకుకు అర్థమేముంది?
పరమార్థ మెక్కడుంది?



దగ్గరుండి దూరంగా మసలేటపుడు
దూరమై దగ్గర కావటమే మంచి మలుపు.
అందమైన వలపు.

నిజమని నేనంటే
కల అని నీ వంటావు.
అయ్యే దెప్పుడో? అని నేను ప్రశ్నిస్తే,
కాని దెప్పుడు? అని నన్నే అడుగుతావు.
నాలో ఉంటావు.
నేనై ఉంటావు.
నేను కుమిలితే, నీవు కనుమరు గవుతావు.
నేను నవ్వితే నా నవ్వుల్లో కొసమెరు పవుతావు.

పొంగే నా గుండెలో
పాలు పొంగే నా గుండెలో
పొంగించే వేడి నీదని,

ఊగే నా ప్రేమలో
ప్రేమ లూరే నా మనసులో
చలువలు నీవేనని,



సాగే నా రాగలతలో
పల్లవి నీ అనురాగం
చరణం - శ్రీచరణం నా అదృష్టం.



నన్ను చూడాలంటే నీ చూపు జారాలి
నిన్ను చూడాలంటే నా చూపు లేవాలి
మనిద్దరి కలయిక ఎప్పుడైనా గగనమే
ఈ రహస్యాన్ని కనటం ఎవరికైనా గహనమే.

మనసులేని వయసిచ్చావు
వయసులేని మనసిచ్చావు
మనసును బాలను చేశావు
వయసును బేలగా మార్చావు


నీవు దూరమైన క్షణాన లేనట్లే ఉంటుంది ఆయువు
నీవు దగ్గరైన క్షణంలో అందినట్లుంటుంది శతాయువు
మొగ్గనైన నన్ను పువ్వును చేసిన కిరణం నీదే.
పువ్వునైన నా పరిమళాలలో స్మరణం నీదే.

పది పదులలో కూడా పగలు ఎందుకో కొందరికి?
నాల్గు పదులలోనే రాత్రెందుకో మరి కొందరికి?
ఉదయించినా, అస్తమించినా అరుణరేఖలే ఆకాశంలో
ఏది ఉండినా, మరేది ఊడినా నీ కరుణరేఖలే ఆంతర్యంలో

ప్రాణములు నావయినా ఉన్నవి నీ కొరకు
అసువులు బాసినా నే నుండెద కోరిక మేరకు
నీవు రానినాడు ప్రాణము లేమి కలిమి?
రాకపోకలు తెలిసిన గాలి కొలిమి?

నేర్చుకొంటిని నీ బడిలో నేర్పులన్నీ
వార్చుకొంటిని నీ ఒడిలో వాక్కులన్నీ
తీర్చుకొంటిని వడ్డీతో నీదు ఋణము
కడతేర్చుకొంటిని ఓర్పుతో జన్మరణము.

ఎందరికో నేను తాతను
నీకేమో చిన్ని పాపను
అందరికీ నీవే తాతవు
నాకేమో కనుపాపవు.





నా పలుకు వినాలని పరుగు లెత్తుతారు అందరు
నా పలుకు లోని నీ పిలుపును వినగలిగేవా రెందరు?
పలుకు నేర్చిన వారికి వలపు లేదు
వలపు తెలిసిన వారికి పలుకు రాదు

పలుకులో వలపు అలవోకగా కలబోసి
ఆరని నా గొంతులో తడియై మిగిలావు
మారని నీ ప్రేమలో ముద్దముద్దగా తడిపావు



మొగ్గ పువ్వయితే ఆగుతుందా పరిమళం?
పరిమళ సుమాన్ని విడిచిపెడతారా ఈ జనం?
అయినా,
కొండంత గుండెతో
గగన మంత గుట్టుగా
సాగర మంత లోతుగా - మొక్కవోని సౌందర్యంతో
మొక్కను వీడకుండా
మొక్కలోనే వాడకుండా
నీ చరణాలపై వాలేందుకు
నిరీక్షిస్తున్న నా సుమనస్సులోని మర్మాన్ని

నూతన సంవత్సర శుభదినాన
ఎందుకో దాచుకోలేక పోతున్నాను.
అంతేకాదు,
దోచుకోమని 'దాసోహ' మంటున్నాను.
దోచుకుంటే 'సోహ' మంటూ ఉంటాను.

ఓం స్వామి సుందర చైతన్యానంద

అందాల హరివిల్లు నీ ఇల్లు

పాట (చైతన్య గానం - 4) **శ్రీమతి సి.పద్మ**

పల్లవి : అందాల హరివిల్లు నీ ఇల్లు
చూచేందుకు నోచుకోవు మా కళ్ళు ॥ అందాల ॥

అనుపల్లవి : సొంపైన ఊరేగింపు నిరంతరము
కనలే దెందుకో మా నేత్రము ॥ అందాల ॥

చరణములు :

1. ఊడుపులన్నీ గాలుల కార్యము
తడుపులన్నీ వానల క్రమము
ముగ్గుల ముత్యాలు నెలరాజు పుణ్యము
మురియని మనసు ఏనాటి పాపము ॥ అందాల ॥

2. కిలకిల నవ్వుచు ఎగిరే గువ్వలు
నీ సదనమున దోగాడు పాపలు
చుట్టే ఋతువులే నీ ఇంటి చుట్టాలు
విరియని చూపులు మా కంటి శాపాలు ॥ అందాల ॥

3. పూచిన పువ్వులే చిరుచిరు నవ్వులు
ఉరుముల రవములే కమ్మని పలుకులు
సెలయేటి గలగలలు తియ్యని రాగాలు
మానవ బ్రతుకులు మాయని గాయాలు ॥ అందాల ॥

4. కాలుడే నీ ఇంటి కాపలా
కాలమే దానికి దాఖలా
నిండాలి ప్రేమలు నలువైపుల
ఉండాలి చైతన్యం దరిదాపులా ॥ అందాల ॥

'విశ్వం విష్ణుః' అంటూ ప్రారంభమౌతుంది విష్ణుసహస్రనామ స్తోత్రం. 'విష్ణువు' అంటే వ్యాపించి ఉండువాడు అని భావం. 'కార్యరూపమైన ఈ విశ్వానికి కారణమైన వాడే విష్ణువు' అని పూజ్య స్వామీజీ తమ వ్యాఖ్యానంలో తెలుపుతారు. కార్యంలో ఉండే దంతా కారణమే కనుక ప్రపంచంలో ఉన్నదంతా పరమాత్మే. నానా రూపాత్మకమైన ఈ విశ్వంలో వసించువాడు ఎవరో కాదు, వాసుదేవుడే. కాబట్టి విశ్వం వాసుదేవ నిలయం.

అందమున్న చోట ఆనంద ముంటుంది. సచ్చిదానంద స్వరూపుడైన వాసుదేవుడు

వసించు ఈ విశ్వం ఒక సుందర మందిరం. ఇది ఒక ఆనందనిలయం. 'పరమాత్మ ప్రపంచాన్ని సృష్టించాడు. పరితాపాన్ని సృష్టించలేదు. ప్రపంచం ప్రపంచంగా మిథ్య, ప్రపంచం పరమాత్మగా సత్యం. కాబట్టి ప్రపంచం యొక్క అర్థం ప్రపంచంలో లేదు, పరమార్థంలో ఉంది' అనేదే పూజ్య గురుదేవులు మనకు సదా అందించే బోధ. ప్రపంచం యొక్క ప్రయోజనం అర్థం కాక, అందులోని అందాన్ని కానలేక బాధలతో బ్రతుకును బరువుగా మార్చుకునేది మానవుడే. ఇది దృష్టి దోషమే కాని సృష్టి లోపం కాదు.

సహజ రంగులతో సృష్టికర్త హస్తాలలో శోభాయమానంగా రూపు దిద్దుకున్నది ప్రకృతి. సచ్చిదానంద స్వరూపుడైన భగవంతుడే అందానికి నిలయం. పరమాత్మ ప్రతిబింబమే సృష్టి సౌందర్యం. కృత్రిమమైన రంగులు పులుముకొని అందాన్ని అరువు తెచ్చుకునేవి మన ఇళ్ళైతే, ఏడు రంగుల అందాల హరివిల్లే ఆయన ఇల్లు. ప్రపంచంలో అందం ఆనందం అడుగడుగునా నాట్యమాడుతున్నా, ఆంతరిక సౌందర్యాన్ని కోల్పోయిన మానవుడు ప్రపంచంలో వికారాలనే చూస్తున్నాడు, వేదనలోనే జీవిస్తున్నాడు. అందుకే,

'అందాల హరివిల్లు నీ యిల్లు, చూచేందుకు నోచుకోవు మా కళ్ళు
సొంపైన ఊరేగింపు నిరంతరము కనలే దెందుకో మా నేత్రము'

ఆకాశంలో అందంగా అహర్నిశం సాగేదే సూర్య చంద్రుల రథోత్సవం. కంటికి వెలుగు నిచ్చేవారు కళ్ళెదుటే ఊరేగుతున్నా చూచేందుకు నోచుకోని అభాగ్యులు కళ్ళు మూసుకొని నిద్రిస్తుంటారు. సృష్టికర్త వైభవాన్ని, భావపుష్టి లోపించిన మానవుడి దురదృష్టాన్ని తెలుపుతూ మానవాళిని మేలుకొలుపుతున్నారు పూజ్య స్వామీజీ.

ఊడుపులన్నీ గాలుల కార్యము తడుపులన్నీ వానల క్రమము
ముగ్గుల ముత్యాలు నెలరాజు పుణ్యము మురియని మనసు ఏనాటి పాపము ॥

జానెడు భూమికి చెంబుడు నీళ్ళు చాలు. నేలనంతా తడపడం వానలకే చెల్లు. పరమాత్మ వాకిటిని గాలులు ఊడవగా, వానలు కళ్ళాపి చల్లుతున్నాయి. ఆకుల మాటున దోబూచులాడే చందమామ తన వెన్నెలతో నేలపై ముత్యాల ముగ్గులను పరుస్తున్నాడు. మన యిండ్ల ముందైతే రోజుకొక ముగ్గు. పరమాత్మ ముంగిటిలో క్షణక్షణానికొక ముగ్గు. 'వాకిటి లోనే ఇంత వైభవం తాండవిస్తూ ఉంది, ఇంటి లోపల ఇంకెన్ని వింతలో' అనుకుంటూ భావ జగత్తులోకి అడుగిడుతున్నారు పూజ్య స్వామీజీ.

కిలకిల నవ్వుచు ఎగిరే గువ్వలు నీ సదనమున దోగాడు పాపలు
చుట్టే ఋతువులే నీ ఇంటి చుట్టాలు విరియని చూపులు మా కంటి శాపాలు ॥

గగనంలో యెగిరే గువ్వలే ఆయన సదనంలో దోగాడు పాపలట. మన నింగి ఆయనకు నేల అయితే ఆయన ఇంటి పైకప్పు ఏమిటో! క్రమం తప్పక వచ్చిపోయే



ఋతువులే భగవంతుడి గృహానికి అతిథులట. వచ్చే చుట్టాలు ఉట్టి చేతులతో వస్తారా? మనసున్న వారు గనుక కానుకలు తీసుకొనే వస్తారు. చల్లని వెన్నెలను, తెల్లని మల్లెలను వేసవి అవనిలో వెదజల్లగా, కేశాల వంటి నల్లని ఆకాశంలో మల్లెచెండు లాంటి తెల్లటి చంద్రబింబం శరత్కాలం ప్రకృతికి చేసే అలంకారం. రెపరెప లాడే పైరులు గలగల పారే సెలయేళ్ళు వర్ష ఋతువు జరిపే సంబరాలు కాగా, చిగురాకుల కొమ్మలలో కోయిలమ్మ గానాలు వసంతం తెచ్చే వినోదాలు. ఈ వింతలన్నీ చూడలేని కళ్ళకు గత శాపాలే గంతలు అంటున్నారు పూజ్య స్వామీజీ.

పూచిన పువ్వులే చిరుచిరు నవ్వులు ఉరుముల రవములే కమ్మని పలుకులు
సెలయేటి గలగలలు తియ్యని రాగాలు మానవ బ్రతుకులు మాయని గాయాలు ॥

భగవంతుడి భవనంలో ప్రతిరోజు పండగే. పువ్వుల నవ్వులు, మబ్బుల ఉరుములు, పక్షుల కిలకిలలు, సెలయేటి గలగలలు - ఇవే ఆయన ఇంటి లోని సందడులు. గాయపడిన హృదయాలకు దివ్యౌషధాలు.

కాలుడే నీ ఇంటి కాపలా కాలమే దానికి దాఖలా
నిండాలి ప్రేమలు నలువైపుల ఉండాలి చైతన్యం దరిదాపులా ॥

కనిపించే దంతా కనుమరుగు కాక తప్పదు. కాల గర్భంలో కలిసిపోక మానదు. జీవుడు కాలుడి వాత పడక ముందే, తన యొక్క నామరూపాలు అదృశ్యం కాకముందే వాటికి ఆధారమైన అస్తి భాతి ప్రియాలను అనుభూతికి తెచ్చుకోవాలి. అనేకత్వంలో ఏకత్వాన్ని దర్శించడం ఒక్క ప్రేమ దృష్టికే సాధ్యం. అందుకే, '**నిండాలి ప్రేమలు నలువైపులా, ఉండాలి చైతన్యం దరిదాపులా**', అంటూ అద్వైతానందానికి పాటతోనే పూల బాటను నిర్మిస్తున్నారు మన ప్రియ గురుదేవులు.


జై జై గురుదేవ!

శ్రీకృష్ణ కథాగానం

ధారావాహిని-5

స్వామి సుందర చైతన్యానంద

(64) అరిష్టే నిహతే గోష్ఠే
కృష్ణేన అద్భుత కర్మణా
కంసాయ అథాహ భగవాన్
నారదో దేవదర్శనః
వినవే మనసా! వినిపించెదను
వీనుల విందుగా వివరముగా ॥ వినవే ॥





(65) ఓయీ! కంసా! ఏమిటీ హింస!
నీ వారందరు చచ్చిరి తెలుసా!
గోకుల కృష్ణుడే దేవకీసుతుడు
నిను తరలించు అని రగిలించె ॥ వినవే ॥



(66) వృషభరూపుడు అరిష్టాసురుని
వధించె కృష్ణుడని తెలిసిన కంసుడు
అశ్వరూపుడగు కేశిని పంపెను
చంపెను కేశిని కేశవుడు ॥ వినవే ॥



(67) మాయలవాడు వ్యోమాసురుడు
అపహరించెను గోపబాలురను
పంకజనయనుడు చంపెను అసురుని
ముక్తులైన గోపులు స్తుతియించిరి ॥ వి ॥

(68) పన్నెను కంసుడు చెడు పన్నాగము
ధనుర్యాగము చతుర్దశి దినము
పంపెను అక్రూరుని కృష్ణుని తెమ్మని
చావుకు ఆహ్వానము పలికె ॥ వినవే ॥





(69) క్రూర మెరుగని అక్రూరుడు సాధువు
తన పుణ్యమునకు తన్మయ మొందె
మదిలో కంసుని మన్నన జేయుచు
వెడలెను హృదిలో కృష్ణు నిడుకొని॥ వి ॥

(70) రామకృష్ణులను చూచె నక్రూరుడు
దండము వలె సాగిలబడి మొక్కెను
క్షేమము అడిగె సేవలు చేసె
సంతసమును కలిగించెను కృష్ణుడు ॥ వి ॥





(71) వచ్చిన కార్యము తెలిపె నక్రూరుడు
గోలగ మారెను గోకుల మంతయు
హరి నవ్వులు హరి మాటలు లీలలు
తలచి వగచిరి గోపవనితలు ॥ వినవే ॥

(72) వలదు శోకము కలదు క్షేమము
తిరిగి వచ్చెదను పెరిగిన ప్రేమతో
అని గోపాలుడు తేరు నెక్కెను
బొమ్మల తీరు నిలిచిరి భామలు॥ వినవే ॥





(73) వాయువేగమున వెడలెను రథము
యమునను జూచి ఆగెను యానము
జలమున దిగెను భక్త అక్రూరుడు
రథమున ఉండెను హరి భగవానుడు॥వి ॥



(74) మల్లవీరులు బలవంతులు క్రూరులు
గెలవగలరా వారిని ఈ బాలురు
సంశయముతో మునక వేసిన
అక్రూరుడు గనెను జలమున కృష్ణుని॥ వి ॥



(75) లేచి చూడగా రథమున ఉండెను
మునిగి చూడగా నీటిలో నవ్వెను
కర్మలు త్రుంచి సంసారము త్రెంచి
కాపాడమని అక్రూరుడు వేడెను ॥ వినవే ॥

(76) ఇంత దాకా ఉంటివి యమునలో
వింత లేమైనా కలవా జలములో
అని ప్రశ్నించిన కృష్ణుని జూచి
అక్రూరుడు చేతులు జోడించె ॥ వినవే ॥





(77) ఎన్ని వింతలో ఎన్నెన్ని మాయలో
లేవు నీళ్ళలో ఉన్నవి నీలో
అని పలికిన అక్రూరుని కృష్ణుడు
దీవించెను దర్శన మొసగి ॥ వినవే ॥



(78) దేవదేవ జగన్నాథ
పుణ్య శ్రవణ కీర్తన
యదూత్తమ ఉత్తమశ్లోక
నారాయణ నమోస్తుతే ॥ వినవే ॥



(79) వీడేనట రక్కసుల చంపినది
వీడేనట పెద్దకొండ నెత్తినది
వెన్నలచోరుడు కన్నెలవీరుడు
వీడే వీడే నని పలికిరి జనులు ॥ వినవే ॥

(సశేషం)

మహిష్మతిలో శంకరయతి

ధారావాహిని-10

స్వామి సుందర చైతన్యానంద

కర్మ మీమాంసల వాస్తవికత

శ్రీ శంకరుల చేతిలో మండనమిశ్రుడు పరాజితు డయ్యాడు. అపజయముచే ఖిన్నుడైన మండన పండితుడు శ్రీ శంకరులను సమీపించి, 'హే యతిశేఖరా! వాదనలో అపజయ మనేది నిజానికి నాకు చాలా నూతన విషయమే. అయినా అది నన్ను దుఃఖ పెట్టుటలేదు. జైమిని మహర్షి ప్రబోధములు ఖండింపబడినవే అనే విషయమే నన్ను ఎక్కువగా క్రుంగదీస్తున్నది. కలవరపెడుతున్నది. భూతభవిష్య ద్వర్తమానముల నెరిగిన విద్వద్వరేణ్యుడు జైమిని మహర్షి. వేదార్థము నెరిగిన పండిత మూర్ధన్యుడు. సమస్త ప్రపంచము సుఖపడాలనే అభిలాషతో వేదమును విస్తరింప జేసినవాడు. అట్టి మహర్షి వ్యర్థములైన ధర్మసూత్రములను రచించెనా? ఈ విషయము నాకు మింగుడు పడుట లేదు' అని విచారమును వ్యక్తం చేశాడు.

మండనుని సందేహమును నివృత్తి చేస్తూ శ్రీ శంకరులు ఇలా పలికారు. 'జైమిని మహర్షి సిద్ధాంతములో ఎక్కడను అపసిద్ధాంతము లేదు. అనభిజ్ఞులం అగుట చేత ఆయన అభిప్రాయమును మనము సరిగ గ్రహించలేక పోయినాము. కర్మమీమాంసకు ఆద్యాచార్యుడగు ఆయన అభిప్రాయము పరబ్రహ్మను ప్రతిపాదించుటయే. పరబ్రహ్మ ప్రాప్తికి సాధన మగుట చేత ఆయన కర్మ సిద్ధాంతమునకు గొప్ప మహత్వము నిచ్చాడు. చిత్తశుద్ధి కర్మ వలననే ప్రాప్తిస్తుంది. ఈ చిత్తశుద్ధియే బ్రహ్మజ్ఞాన ప్రాప్తికి సహాయక మవుతుంది' అన్నారు శ్రీ శంకరులు.

'యతివరేణ్యా! మీరు చెప్పినదే మహర్షి అభిమతమైతే జీవుని కంటెను, ఈశ్వరుని కంటెను వేరైన కర్మయే ఫలము నిచ్చునది అని జైమిని ఎందుకు నిర్ణయించాడు? ఈశ్వరుని కూడా ఎందుకు నిరాకరించాడు?' అని తన సందేహమును శ్రీ శంకరుల ముందు ఉంచాడు మండనమిశ్రుడు.

'సుమతే! కుండ మొదలైన వాటి వలెనే ఈ ప్రపంచము కూడా కార్యరూపమున తెలియుచున్నందున దీనికి కర్తయైన వాడు ఒకడు ఉండి తీరాలి అనేది అనుమాన ప్రమాణము. వేద ప్రమాణము లేకనే ఈశ్వరుని అనుమాన ప్రమాణము సాధించుచున్నది. కనుక అనుమాన ప్రమాణముచే సిద్ధించిన ఈశ్వరుని వేదములు అనువదించునవి మాత్రమే అయి ఉన్నవి అని వైశేషికుల (కణాదముని మతానుయాయులు) అభిప్రాయము.

ఈ అభిప్రాయము సరియైనది కాదు. ఉపనిషత్ప్రమాణం లేకుండా పరమాత్మ తెలియబడడు. వేదమును తెలియని వాడు పరమాత్మను గ్రహించలేడు.

తం త్వౌపనిషదం పురుషం పృచ్ఛామి, నావేదవి న్మనుతే తం బృహంతమ్

అని శ్రుతి వాక్యము వేద ప్రమాణమును నొక్కి వక్కాణించు చున్నది. కనుక కాణాదులు తెలిపే అనుమాన ప్రమాణము ఈశ్వరుని ఎలా తెలుపుతుంది? అనే సందేహమును మనసులో ఉంచుకొని ఈశ్వర పరమైన అనుమానమును నిరసించారు జైమిని మహర్షి. కనుక జైమిని నిరాకరించింది అనుమాన గమ్యుడైన ఈశ్వరునే గాని వేదగమ్యుడైన ఈశ్వరుని కాదు.

ఇతి గూఢభావ మనవేక్ష్య బుధా స్తమనీశవాద్యయమితి బ్రువతే!

ఈ విధంగా జైమిని తెలిపిన నిగూఢ విషయమును పరిశీలించకనే పండితు లనేకులు ఆయనను నిరీశ్వరవాది అనుచున్నారు.

'పండితమన్యులు జైమినిపై అలా ఆరోపణ చేసినంత మాత్రాన ఆ బ్రహ్మ విద్వర్యుడు నిరీశ్వరవాది అగునా? గుడ్లగూబలు చీకటిని ఆరోపించినంత మాత్రాన పగటిపూట సూర్యుని ప్రకాశము ఎప్పుడైనా దూషిత మవుతుందా?' అని యతికేసరి శ్రీ శంకరులు తెలిపిన జైమిని సిద్ధాంత హృదయమును గ్రహించి మండనుడు మిక్కిలి హృదయానందమును అనుభవించాడు. అంతర్ముఖుడై జైమిని మహర్షిని పశ్చాత్తాప హృదయముతో ధ్యానించాడు. నిర్మల హృదయుడైన మండనమిశ్రునికి జైమిని మహర్షి సభామధ్యమున ప్రత్యక్ష మయ్యాడు. మండనమిశ్రునికి హితబోధ చేశాడు.

హే మండన పండితా! నేను రచించిన సూత్రములకు శ్రీ శంకరులు చెప్పినదే సరియైనదని నా అభిప్రాయము. ఈ సంయమీంద్రునికి నా హృదయమే కాదు. వేద హృదయము, సకల శాస్త్ర హృదయము అవగతము. త్రికాలముల యందు జరుగునది ఏదైనను అది ఇతని జ్ఞానమునకు దూరము కాదు.

చూడు నాయనా! ఉపనిషద్వాక్యములు 'చిదేకరసతత్పరము' అని వ్యాస మహర్షి నిర్ణయించి యున్నాడు. ఆయన భావానికి విరుద్ధముగా నేను ఒక్క సూత్రము నైనను ఎలా చెప్పగలను? నేను జ్ఞానమును పొందినది వ్యాస మహర్షి నుండి అనే సత్యమును మరచితివా?

హే సుయశః! సందేహాలను త్యజించు. నేను చెప్పే రహస్యమును వంట పట్టించుకో. సంసార సాగరమగ్నులైన జనులను ఉద్ధరించుటకు అవతరించిన పరమశివుడే ఈ శంకరుడు అని గుర్తించు. ఇతడే పరమాత్మ అని గ్రహించు.

ఆద్యే సత్త్వమునిః సతాం వితరతి జ్ఞానం ద్వితీయే యుగే
దత్తో ద్వాపర నామకే తు సుమతి ర్వ్యాసః కలౌ శంకరః।
ఇత్యేవం స్ఫుట మీరతోఽ స్య మహిమా శైవే పురాణే యత
స్తస్య త్వం సుమతే మతే త్వవతరేః సంసారవార్ధిం తరేః॥

'కృతయుగమున కపిల భగవానుడు, త్రేతాయుగమున దత్తాత్రేయ భగవానుడు, ద్వాపర

యుగమున వ్యాస భగవానుడు, కలియుగమున శంకర భగవానుడు జ్ఞానదానము చేస్తారని వీరి వైభవమును శివపురాణము వర్ణించి యున్నది. హే సుమతే! కనుక నీవు ఈయన మార్గమున ప్రవేశించు. భవసాగరమును తరింపుము' అని పలికి జైమిని అంతర్హితు లయ్యారు.

మండనమిశ్రుడు శ్రీ శంకరుల వైపు తిరిగి 'హే యతిశేఖరా! నిన్ను ఇప్పుడు గ్రహించాను. జగత్కారణానివి నీవే. నీకు అధికుడు లేడు. సముడు ఉండడు. నీవు చిన్మాత్ర స్వరూపుడవు. మావంటి అజ్ఞానులను ఉద్ధరించుటకే ఈ దేహముతో చరిస్తున్నావు.

హే జగదార్తి హర! ఊహింప శక్యము గాని నీ వైభవమును తెలియక అనుచిత వాక్యములను పలికాను. ***'క్షమస్వ కరుణా జలధే!'*** హే కరుణాసాగరా! దాని నంతయు క్షమించు.

కర్మ యనెడి యంత్రము నెక్కి తపస్సు, శాస్త్రము, ఇల్లు, ఇల్లాలు, బిడ్డలు, దాసదాసీ జనము, సిరిసంపదలు అను వీటి చేత బాగా బలిసిన అభిమానముతో సంసార కూపములో పడి దిక్కు తెలియక యున్న నన్ను ఉద్ధరించావు. తరింప చేశావు.

గత జన్మలలో నేను గొప్ప తపస్సు చేసి ఉంటాను. లేనిచో ఈ జన్మములో జగదీశ్వరుడవైన నీతో ఇలా వర్తించే భాగ్యము ఎలా సాధ్యము? తపోఫలంగా నీ దర్శన భాగ్యము ప్రాప్తించింది. నీకు ప్రణామము చేసిన ఫలంగా అజ్ఞానాంధకారము నుండి విముక్తి పొందుచున్నాము.

చింతా సంతానశాఖీ పద సరసిజయో ర్వందనం నందనం తే
సంకల్పః కల్పవల్లీ మనసి గుణనుతే ర్స్వర్ణనా స్స్వర్ణదీయమ్।
స్వర్గో దృగ్గోచర స్త్వత్పద భజన మతః సంవిచార్యేదమార్యా
మన్యంతే స్వర్గ మన్యం తృణవదతి లఘుం శంకరార్య త్వదీయాః॥

'హే భగవత్పూజ్యపాద! నీ పాదకమల వందనము నందనవనము. మదిలో కదిలే నిన్ను గూర్చిన సంకల్పలతయే కల్పలత. నీ గుణానుకీర్తనమే పవిత్ర గంగాస్నానము. నీ వీక్షణ ప్రసారమే స్వర్గము. నీ కృపా వీక్షణమే మోక్షము. ఈ విధంగా నీ భక్తి వైశిష్ట్యమును గ్రహించిన శిష్టాచార సంపన్నులగు నీ భక్తులు అన్యమైన స్వర్గమును గడ్డిపోచలా చులకనగా త్యజిస్తున్నారు' అని మండన మూర్ధన్యుడు శిరము వంచి శ్రీ శంకరులకు ప్రణమిల్లినాడు. ఆచార్యుల వారి విద్వత్తును వేద మర్మజ్ఞత్వమును అంగీకరించిన మండన పండితుడు గృహస్థాశ్రమాన్ని త్యజించి సన్న్యాసాశ్రమాన్ని స్వీకరించుటకు సంసిద్ధుడయ్యాడు. సన్న్యసించిన మండనుడు సురేశ్వరాచార్యుడు అనే నామముతో శంకర భగవత్పాదుల ముఖ్య శిష్యులలో ఒకడై శోభించాడు. శంకరుల వచనానుసారము ఉభయ భారతి శారదా పీఠంలో అధిష్ఠాత్రీదేవిగా నిలిచిపోయింది. ***(39వ పేజీ చూడుము)***

ఓ కథ చెప్పనా!

స్వామి సుందర చైతన్యానంద

సాటి లేని సోమరి

ఒక గ్రామంలో ఇద్దరు మిత్రులు ఉండే వారు. ఒకడిని మించిన సోమరి ఇంకొకడు. ఊరిలో అదే పనిగ పగటి పూట కూడా నిద్రిస్తూ ఉంటే గ్రామస్థులు, కుటుంబీకులు గొడవ చేస్తారని, ఇద్దరు మిత్రులు పరస్పరం మాట్లాడుకొని, ఊరు బయటకు ఏదో కార్యార్థము వెళ్ళినట్లు వెళ్ళి, ఒక చెట్టు నీడను చూసుకొని నిద్ర పోతూ ఉండే వారు.



ఒకనాడు రహదారి ప్రక్కనే ఉన్న నేరేడు చెట్టు నీడలో ఇద్దరూ ప్రక్క ప్రక్కనే వెలికిల పడుకున్నారు. పైన చెట్టుకు నేరేడు పండ్లు గుత్తులు గుత్తులుగా వేళ్ళాడున్నాయి. అవి తిని పడుకుంటే బాగుణ్ణు అనుకుంటాడు అందులో ఒకడు. మరి, వాటిని తినాలి అంటే లేవాలి. చెట్టెక్కాలి. ఇదంతా చేయాలంటే, సోమరితనాన్ని ఏ ఉట్టి కెక్కించాలి? పడుకొని అలా ఆలోచిస్తూ ఉంటే, ఈ లోగా చెట్టుపై నుండి నేరేడు పండు ఒకటి జారి అతని ప్రక్కనే పడింది. సోమరికి నోరూరింది.


అదే సమయానికి ఒక బాటసారి ఆ దారిన పోతున్నాడు. ఇదే మంచి అవకాశం అని భావించిన సోమరి, 'అయ్యా! అయ్యా! దయ చేసి ఇటు రండి' అని బాటసారిని అర్థించాడు. బాటసారి పాపం, ఏమైందో అనుకుంటూ ఆదుర్దాగా దగ్గరకు వచ్చాడు. అతడితో ఈ సోమరి, 'మరోలా అనుకోకండి. నా ప్రక్కనే పడి ఉన్న నేరేడు పండును కాస్త నా నోట్లో పడేసి పొండి, పుణ్య ముంటుంది' అన్నాడు.

ఆ మాటలకు బాటసారి కోపోద్రిక్తు డయ్యాడు. 'ఛీ! నువ్వసలు మనిషేనా? నీదీ ఒక బ్రతుకేనా?' అంటూ, తిట్టిన తిట్టు తిట్టకుండా, మొహం వాచేటట్లు చీవాట్లు వేసి తన దారిన తాను పోయాడు.

ప్రక్కనే పడుకొని ఉన్న రెండో సోమరి, 'అలాగే కావాలి, వెధవకి. బాగా పడ్డాయి. లేకపోతే, నిన్న నా ముఖం మీద కాకి రెట్ట వేస్తే, కాస్త తుడవరా అంటే, లేచి తుడిస్తేనా! ఈ రోజు బాగా పూజ అయిందిలే' అని మహా సంతోష పడిపోయాడు.

చతుర్విధ పురుషార్థములు

స్వామి సుందర చైతన్యానంద



తనలో ఒక వెలితిని, అసంపూర్ణతను, అవసరాన్ని మోసుకుంటూ మనిషి చరించ లేడు. వాటి నుండి విడిపడేందుకు, తనలో వాటిని దూరం చేసుకొనేందుకు మనిషి సదా ప్రయత్నిస్తూ ఉంటాడు. ఈ ప్రయత్నంలో అనేకమైన వాటిని అవసరాలుగా నిర్ణయించుకొని వాటిని పొందేందుకు యత్నిస్తూఉంటాడు. అవి ఎన్నోగా కనిపించవచ్చు. కాని విశ్లేషించి విభజిస్తే అవి నాలుగు విధాలుగా తెలుస్తాయి. ప్రతి పురుషుడు ప్రయత్నించి పొందాలనుకొనే ఈ ప్రయోజనములను పురుషార్థములు అంటారు. అవియే ధర్మార్థ కామ మోక్షములు. చతుర్విధ పురుషార్థములు అంటారు. వీటిని మళ్ళీ రెండు భాగాలుగా విభజిస్తే (1) అర్థకామాలు (2) ధర్మమోక్షాలు. అర్థకామాలు అన్ని ప్రాణులలో గోచరి స్తుండగా, ధర్మమోక్షాలు మానవులకే సంబంధించి ఉన్నాయి.

అర్థం :

తమ మనుగడకు ఏది అవసరమని జీవులు భావించడం జరుగుతుందో, ఏది లేకపోతే తమ జీవితం కొనసాగదనే అభిప్రాయం కలుగుతూ ఉందో, దేని వలన భద్రత లేని తమ బ్రతుకుకు రక్షణ లభించడం జరుగు తుందని తలంచు చున్నారో అది 'అర్థ' మనే పురుషార్థంగా ఉంది. దేహం నిలబడేందుకు ఆహారం కావాలి. దేహం వసించేందుకు ఇల్లు కావాలి. దేహాన్ని కప్పుకునేందుకు వస్త్రం కావాలి. ఇదంతా రక్షణలేని తన జీవితానికి రక్షణగా మనిషి భావిస్తాడు. వాటిని పొందేందుకు యత్నిస్తాడు.

ఈ పనిని పశుపక్ష్యాదులు కూడా చేస్తున్నాయి. మనిషి ఇల్లు నిర్మించుకొంటే, పక్షి గూడు కట్టుకుంటూ ఉంది. ఎలుక బొరియలు చేసుకుంటూ ఉంది. పాము పుట్టను నిర్మించుకుంటూ ఉంది. వండిన ఆహారాన్ని మనిషి తింటూ ఉంటే, వంటబట్టే ఆహారాన్ని జంతువులు తింటున్నాయి.

వీటికై మానవునితో పాటు పశుపక్ష్యాదులు కూడా అన్వేషిస్తూ ఉన్నాయి. సాధిస్తూ ఉన్నాయి. అయితే ఇక్కడ ఒక్కటే తేడా. నిలువ చేసుకొని జంతువులు తాత్కాలికంగా తృప్తి చెందుతున్నాయి. ఎంత నిలువ జేసుకున్నా మనిషి తృప్తి నెరుగడు.

ఈ అర్థమనే పురుషార్థ సాధన ద్వారా మనిషి అభద్రత నుండి బయట పడలేక పోతున్నాడు. ఒంటికి భద్రత కావాలని ఇంటిని నిర్మించు కున్నాడు. ఇంటికి ఒంటికి రెంటికి భద్రత లేదని తెలి పోగానే మళ్ళీ నిరాశలో కూరుకు పోతున్నాడు.

అర్థాన్ని మనిషి సంపాదించ వచ్చు. కాని దాని వలన జీవితము సమర్థవంతము కాదని పశుపక్ష్యాదులకు తెలియదు. మనిషి తెలుసుకుంటాడు.

కామం :

'రక్షణ' అనేది 'అర్థం' అనే పురుషార్థానికి సంబంధించిన విషయం కాగా, 'సుఖం' అనేది 'కామం' అనే పురుషార్థానికి సంబంధించిన విషయం. ఈ సుఖం ఇంద్రియాలకు సంబంధించింది కావచ్చు. లేదా మనసుకు సంబంధించింది కావచ్చు. లేదా హృదయానికి సంబంధించినది కావచ్చు. దేహాన్ని రక్షించుకోవడానికి ఆహారాన్ని సంపాదించు కుంటారు. ఇది అర్థం. ఎలాంటి ఆహారము కావాలి అనేది కామం. పడుకోవటం కూడా దేహానికి విశ్రాంతి నివ్వడమే కనుక అదీ రక్షణయే. అర్థమే. లేకపోతే దేహం పాడైపోతుంది. కాని, ఎలాంటి పడకపై పడుకోవాలి అని ఆలోచించటం కామం అవుతుంది.

మనకు రుచు లున్నాయి. అభిరుచు లున్నాయి. అభీష్టాలు చిత్ర విచిత్రంగా ఉన్నాయి. కేవలం ఆహారం, నిద్ర, వస్త్రము, గృహముతో మనిషి భద్రతను పొంది తృప్తి చెందలేక పోతున్నాడు. ఉల్లాసాలు, విలాసాలు, సుఖాలు, వినోదాలు, వికాసాలు ఎన్నో వాంఛిస్తున్నాడు. అవన్నీ 'కామం' అనే పురుషార్థం క్రిందికి వస్తాయి.

అందాలు కావాలి. విహారం కావాలి. సాహిత్యం కావాలి. సంగీతం కావాలి. ప్రేమ కావాలి. శృంగారం కావాలి. లైంగిక తృప్తి కావాలి. బాంధవ్యాలు కావాలి. క్రీడలు కావాలి. పువ్వులు కావాలి. నవ్వులు కావాలి. నృత్యం కావాలి. సఖ్యం కావాలి. ఇవన్నీ భద్రత కొరకు కావు కనుక అర్థం క్రిందికి రావు. సుఖం క్రిందికి వస్తాయి. ఇదంతా కామం. ఇది కూడా మనుషులకే పరిమితం కాదు. కొద్దో గొప్పో ప్రాణులలో గోచరిస్తూ ఉంది. నెమలి నృత్యం చేస్తుంది. కోయిలమ్మ పాడుతుంది. నక్క ఈల వేస్తుంది. పక్షి మెత్తని గూడు నిర్మిస్తుంది. కోతి ఆడుతుంది. ప్రసవించగనే బిడ్డ మాలిన్యాన్ని గోవు శుభ్రం చేస్తుంది. వాటికీ ఆటలున్నాయి. పాటలున్నాయి. అనుకున్నవి పాడై నపుడు కన్నీళ్ళున్నాయి. ఈ కామం అనే పురుషార్థ సాధన ద్వారా మనిషి పూర్ణంగా సుఖపడలేక పోతున్నాడు. సుఖాన్నిచ్చే వస్తువు ఎప్పుడూ సుఖాన్ని పంచలేక పోగా, సుఖాన్ని కోరే మనిషి ఒకే వస్తువును అన్ని కాలాలలో, అన్ని ప్రదేశాలలో, అన్ని దశలలో సుఖ కారణంగా భావించలేక పోతున్నాడు. ఈ ప్రపంచంలో సుఖ స్థానాలన్నీ క్షయములే. క్షరములే.

ధర్మం :

ఈ ధర్మం అనే మూడవ పురుషార్థంలో నైతికమైన అవగాహన నిండిఉంది. ఇది వివేకానికి సంబంధించిన విషయం. పశుపక్ష్యాదులు వివేకము లేక, కేవలం సహజాతాలపై ఆధారపడి యాంత్రికమైన జీవనాన్ని కొనసాగిస్తున్నందున అవి ఈ ధర్మ మనే పవిత్రమైన పురుషార్థానికి నోచుకోవు.

కామం గాని, అర్థం గాని ప్రాణులలో తలెత్తి నపుడు తమ సుఖానికి, లేదా తమ

రక్షణకి అన్య ప్రాణులను ఉపయోగించుకోవడం కనిపిస్తూ ఉంటుంది. ఇలా ఇతరులను తమ సుఖాలకు ఉపయోగించుకొనే వాంఛ తీవ్ర మైనపుడు అది హింసగా పరిణమిస్తుంది. ఇలాంటివి జంతు ప్రపంచంలో చూస్తూ ఉంటాము. అలాగని వాటిని తప్పు పట్టలేము. వాటికి వివేకము లేదు. అందుచేత అంతకన్నా భిన్నంగా, గొప్పగా జీవించలేవు.

ఇక్కడే మనిషియొక్క విశిష్టత. మనిషి తన సుఖానికై యత్నించవచ్చు. కాని, అది మరొకరి సుఖాన్ని పాడుచేయ కూడదు. నే నెలా సుఖించా లనుకుంటున్నానో ఇతరులు కూడా అలాగే సుఖపడాలి అని అనుకుంటున్నాను. కనుక, నేను సుఖపడతాను. అంతేకాదు. ఇతరుల సుఖానికి అడ్డు నిలవను. ఇది ధర్మం.

నా ఆస్తిని ఇతరులు అపహరిస్తే నేను భరించలేను. కనుక, ఇతరుల ఆస్తిని నేను అపహరించకూడదు. ఇది ధర్మం. ఒకరు నన్ను శారీరకంగా, లేదా మానసికంగా గాయపరిస్తే నేను వ్యధ చెందుతున్నాను. నా విషయంలో వాళ్ళు అలా ప్రవర్తించి ఉండకూడదు అని భావిస్తున్నాను. ఒకవేళ నా పరిస్థితిలో ఎవరున్నా అలాగే ఆలోచిస్తారు. నా విషయంలో ఇతరులు ఎలా ప్రవర్తించ కూడదని నేను భావిస్తున్నానో ఇతరుల విషయంలో నేను అలా ప్రవర్తించకుండా ఉండాలి. ఇది ధర్మం.

ఈ విధమైన ధర్మబద్ధమైన జీవనం వలన వ్యక్తికి, సమాజానికి న్యాయం జరుగుతుంది. ఈ ప్రవర్తనను క్రమ పరచేందుకు చట్టా లున్నాయి. ప్రభుత్వా లున్నాయి. సెక్యులర్ వ్యవస్థ సరిపోతుంది. కాని, మతధర్మా లెందుకు? అనే ప్రశ్న ఉద్భవిస్తుంది.

దారి తప్పిన వారిని సంస్కరించేందుకే చట్టాలున్నాయి. ఇవి మానవ నిర్మితాలు. కాని, దారి తప్పిన మనిషి చట్టాన్ని కూడా తప్పించు కొనేందుకు ప్రయత్నిస్తాడు. చట్టం కన్ను కప్పేస్తే తాను ఎవరి కంట పడకుండా సుఖించవచ్చు అనుకుంటాడు.

చట్టాన్ని తప్పుకోవచ్చు. ధర్మాన్ని, దైవాన్ని తప్పుకోలేవు అంటూ మతం ప్రవేశిస్తుంది. ఈ ప్రపంచంలో స్థూలంగా కర్మలు చేస్తాం. ఆ కర్మలు చేయాలి అనే సంకల్పం మొదట సూక్ష్మంగా ఉంటుంది. ఈ విధంగా ప్రతి కర్మకు స్థూల సూక్ష్మ రూపా లుంటాయి.

స్థూల కర్మకు స్థూల ఫలితమున్నట్లు, సూక్ష్మ కర్మకు సూక్ష్మ ఫలిత ముంటుంది. ఈ సూక్ష్మ ఫలితాలే పాపపుణ్యాలు. ఇవి మానవుల చేతిలో ఉండవు. దైవాధీనములు. కనుక చట్టాన్ని మనిషి తప్పించుకో వచ్చు. పాపాన్ని తప్పించుకోలేడు. అలాగే చట్టం ద్వారా మనిషికి న్యాయం జరుగక పోవచ్చు. కాని, పుణ్యఫలం నిరీక్షిస్తూనే ఉంటుంది.

కనుక, పశుపక్ష్యాదుల వలె కాకుండా ధర్మబద్ధంగా మానవులు చరించాలి. దైవమే ధర్మాల రూపంలో ఉన్నందున ధర్మాన్ని రక్షించిన వారు దైవంచేత రక్షింపబడతారు.

ధర్మజీవనం మనిషికి సుఖాన్ని ప్రసాదిస్తుంది. ఒక పేదవాడు ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడని తెలిసి, అతనికి సాయం చేసి అతడిని బ్రతికించగలిగా మనుకోండి. ఆ క్షణంలో మన మనసు ఎంత సంతోష పడుతుంది? ఇది సుఖం కాదా? అయితే, ఇది కామం

లాంటి సుఖం కాదు. అర్థం లాంటి సుఖం కాదు. తనకు వ్యక్తిగతంగా ఏమి లభించకున్నా సుఖించే ఆంతరంగిక స్థితి. ఇది ధర్మం పెట్టిన భిక్ష.

ధర్మం నీడలో నిలిచి సుఖించే పుణ్యాత్ములకు కష్టాలు కూడా సుఖాలు గానే తెలుస్తాయి. ధర్మం కొరకు రాముడు కానలకేగాడు. ధర్మం కొరకు పాండవులు అష్ట కష్టాలు పడ్డారు. ధర్మం కొరకు శిబిచక్రవర్తి తన దేహాన్నే కోసి పెట్టాడు. ధర్మం కొరకు దధీచి తన శరీరాన్ని దగ్ధం చేశాడు. ధర్మ కార్యాచరణలో తనకు ప్రత్యేక సుఖం అవసరం లేదు. అందరూ సుఖపడే కార్యం కనుక అందరి సుఖంలో తన సుఖం కూడా నిలిచి ఉంది. ఒకవేళ ఆ ధర్మాచరణం వలన తాత్కాలికంగా తనకు అసౌకర్యం ఏర్పడినా, అది పదిమందికి సౌకర్యాన్ని కల్పిస్తున్నదనే భావనలో తన అసౌకర్యం సౌకర్యంగా మారి పోతుంది. సుఖంగా మారి పోతుంది.

రాత్రింబవళ్ళకు తేడా తెలియకుండా, లోకకళ్యాణానికి కంకణం కట్టుకొని మహాత్ములు ధర్మ ప్రచారములో నిమగ్నమై ఉంటారు. ఆహార నిద్రాదులు కూడా మరచి పోతారు. వారి దేహం సహజ ధర్మాలకు లోబడి అనారోగ్యానికి గురి అయినా వారి హృదయం నిత్యానందంతో పరవళ్ళు త్రొక్కుతూ ఉంటుంది. ఈ విధంగా అర్థ, కామ, ధర్మాలనే మూడు పురుషార్థములలో ధర్మము విశిష్ట మైనందున దానికి అగ్రస్థాన మిచ్చి ధర్మార్థ కామములనెడి త్రివర్గములలో ధర్మానికే ప్రథమస్థాన మిచ్చారు.

అర్థకామాలను పొందాలనుకొనే వారు ధర్మానికి మొదటిస్థానం ఇవ్వాలి. అప్పుడు అర్థకామాలు మనిషిని బంధించవు. ధర్మంతో కూడిన కామం, ధర్మబద్ధమైన అర్థం సుఖశాంతుల్ని పెంపొందిస్తాయి. ధర్మం తోడుగా ఉన్నది కనుక దైవం తోడుగా ఉన్నట్లే.

ధర్మా విరుద్ధో భూతేషు కామోஉస్మి భరతర్షభ

'ధర్మమునకు విరుద్ధము కాని కామము నేనే' అని శ్రీకృష్ణ పరమాత్మ భగవద్గీత - 7వ అధ్యాయము విజ్ఞాన యోగంలో తెలిపారు.

మోక్షం :

ఇదొక ప్రత్యేకమైన స్వేచ్ఛ. ప్రతి వ్యక్తి కోరుకునే స్వేచ్ఛ. అందరూ కోరుకునే విడుదల. పంజరంలో బంధింపబడియున్న పక్షి యాతన లాంటిది. ఈ స్వేచ్ఛ లభించడమే మోక్షం, లేదా ముక్తి. అయిష్టమైన దాని నుండి విముక్తి.

దుఃఖాన్ని మనం భరించలేము. ఒంటరితనాన్ని భరించలేము. పరిమిత జీవనాన్ని భరించలేము. వాంఛలను భరించలేము. కాలాన్ని భరించలేము. దేశాన్ని భరించలేము. నశింపును సహించలేము. వీటన్నిటి నుండి విడిపడా లనుకుంటాం. ఇదే నిజమైన సుఖంగా భావిస్తాం. అలాంటి సుఖక్షణాలు మన అనుభవంలో ఉన్నాయి. కోరికలు తీరినపుడు మెరుపులా తొంగి చూస్తున్నాయి. నిద్రలో దోబూచు లాడుతున్నాయి. ఆ క్షణాలు శాశ్వతంగా నిలిచిపోవాలనే ప్రతి ఒక్కరూ ఆశిస్తున్నారు. ఇదొక ప్రగాఢమైన కాంక్ష. మోక్ష కాంక్ష.

మోక్షమనేది పరిస్థితి కాదు. స్థితి. మరో లోకానికి సంబంధించినది కాదు. ఎప్పుడో ఊడిపడేది కాదు. ఇప్పుడున్నదే. ఇక్కడున్నదే. అది మన స్వరూపము. సచ్చిదానంద స్వరూపము. సాధ్యము, సాధకుడు ఒక్కరేనన సత్యోదయంలో విరజిమ్మబడే ప్రకాశైక స్వరూపము. అదియే ఆత్మ.

న హ్యాత్మా నామ కస్యచిత్ అప్రసిద్ధః ప్రాప్యోవా ఉపాదేయో వా

'ఆత్మ అనేది ఏ కాలములో కూడా ఎవరికి కూడా తెలియనిది కాదు. ప్రయత్నించి పొంద దగినది కాదు. అలాగని విడిపడేది కాదు. పొందేదీ కాదు,' అని శ్రీ శంకరాచార్య స్వామి గీతాభాష్యంలో తెలిపారు.

స్వతః సిద్ధమై, స్వతః ప్రమాణంగా భాసించే ఆత్మ తానేనని గ్రహించిన చిదానంద స్వరూపునకు ఈ చతుర్విధ ఫల పురుషార్థములకై సంకల్పం చేయవలసిన అవసర మేముంది? అలా సంకల్పించి ఏమి పొందాలి? పొందవలసినది ప్రత్యేకంగా ఏముందని?

తాను సుఖ స్వరూపుడు. అన్యసుఖాలు తన కవసరం లేనందున కామ మనే పురుషార్థం అతనికి లేదు. అతడు నిరవయవ సత్తా రూపుడైనందున అభద్రత తెలియని వాడై శోభించు చున్నందున అర్థమనే పురుషార్థం లేనివాడై యున్నాడు. దేశకాలాదులలో చిక్కి పరిణామం చెందే ధర్మమూసలో అనంతుడైన తాను ఒదగలేడు కనుక ధర్మమనే పురుషార్థం తనకు లేదు. ఇక తానే మోక్షరూపు డైనందున మోక్షాపేక్ష కలిగేందుకు అవకాశము లేనందున మోక్షకామి కూడా కాలేడు. కనుక చిదానంద రూపుడైన జ్ఞానికి చతుర్విధ పురుషార్థములు కూడా లేవు. మోక్షము ఉన్నదే గాని యత్నించి పొందేది కాదు.

కర్తవ్యేన సాధ్యశ్చేత్ మోక్షః అభ్యుపగమ్యతే అనిత్య ఏవ స్యాత్

'కర్మ యొక్క ఫలితంగా మోక్షమును సాధించుటకు వీలు పడుతుంది అని భావించే టట్లయితే ఆ మోక్షము అప్పుడు అనిత్యమని తేలుతుంది' అని శ్రీ శంకరాచార్య స్వామి బ్రహ్మసూత్ర భాష్యంలో తెలిపారు. నీవు శివుడవు. నేను శివుడను. చిదానంద రూపుడను. పూర్ణుడను. ఒకసారి పూర్ణుడ నని తెలిసిన తరువాత ఇక అది కాకుండా మరోవిధంగా ఎలా ఉండగలను? కనుక నేను సదా పూర్ణుడను.

నాకు బంధ మెలా వస్తుంది? దుఃఖ మెలా వస్తుంది? నాకు బంధాన్ని, దుఃఖాన్ని ఇచ్చే దెవరు? అన్నీ నా మీదనే ఆధారపడి ప్రకాశిస్తున్నాయి. నాపై ఆధారపడి ప్రకాశించేవి నన్ను ఎలా బాధిస్తాయి? నేను సదా ప్రకాశిస్తున్నాను (భాతి). నాకు అన్యంగా తెలిసేవి అన్నియు నాపై ఆధారపడి, నన్ను అనుసరించి ప్రకాశిస్తున్నాయి (అనుభాతి).

ఇది తెలియనంత వరకు బంధము. తెలిస్తే మోక్షము. తెలిసీ తెలియకుండా ఉంటే ముముక్షుత్వము. జ్ఞానస్థితిలో తెలియదు అనేది ఉండదు. తెలియదు అనేది లేనపుడు తెలిసింది అనేది మాత్రం ఎలా ఉంటుంది? కనుక మోక్షము కూడా ఆత్మజ్ఞాన స్థితిలో తెలియనిదే అగుచున్నది.

చైతన్య రామాయణము

స్వామి సుందర చైతన్యానంద

ఆదికవి రచించిన ఆదికావ్యం ఆదిత్య ప్రకాశంతో కవితా గగనంలో శోభిస్తున్నా, దేశకాల పరిస్థితుల ననుసరించి, రామాయణాన్ని నూతన ఫక్కీలో ఎందరో మహాత్ములు రచించారు.



అందరి రచనలు ప్రయోజనాన్ని ఊహించినవే అయినా, ప్రయోగాలలో, పద్ధతులలో ఒక విధంగా సాగలేదు.

1. తులసీ రామాయణం

మంగల కరని కలిమల హరని తులసీ కథా
రఘునాథ కీ!

రఘురాముని చరితము కళ్యాణ ప్రదమైన స్థితిని సమాజంలో ఆవిష్కరిస్తుందని, కలియుగ దోషములను నివారిస్తుందని జనావళికి హామీ ఇస్తూ రామచరిత మానసాన్ని ప్రారంభించి రచించాడు తులసీదాసు. హిందూ సమాజంలో నూతన తేజాన్ని నింపాడు. 'భక్తుడైన వాడు ఒక్కసారైనా తులసీ రామాయణాన్ని తప్పక చదవాలి' అంటారు మహాత్ములు.

నారాయణుని లోని నరుణ్ణి దర్శించినవాడు వాల్మీకి.

నరునిలో నారాయణుణ్ణి దర్శించిన వాడు తులసీదాస్.

'తులసీ రామాయణం భక్తుల పాలిటి పారిజాతం. హిందువులకు వేదం వంటిది. ముస్లిములకు ఖురాను లాంటిది' అని శ్లాఘించాడు మహాకవి రహీమ్.

2. కంబరామాయణం

తమిళ ప్రజలకు రామాయణాన్ని అందించి, సమాజ రథ చక్రాలను నూతన మార్గంలో త్రిప్పాలని కంబరు అభిప్రాయ పడ్డాడు. తన రామాయణాన్ని ఆనాటి సమాజం ఆదరించ దేమో, నిరసిస్తుందేమో అనే భావన కూడా కంబరులో లేకపోలేదు. అయినా ఈ మహోత్తమ కార్యానికి కంబరు వెనుకాడలేదు.

'వాల్మీకి రామాయణాన్ని చదివి, అందలి దివ్యత్వాన్ని అవగతం చేసుకున్న నేను

నా ఆనందాన్ని ప్రపంచంతో పంచుకోవాలనే అభిలాషను, ఆవేశాన్ని నిగ్రహించుకోలేక రామాయణ కావ్య రచనను చేస్తున్నాను' అంటాడు రసవత్తర భావోత్కర్షకు మారుపేరైన కంబరు కవి.

3. భావార్థ రామాయణము

మహారాష్ట్ర దేశంలో ప్రాకృతంలో గ్రంథాలు రచించి, ఆనాటి పండితుల ఆగ్రహానికి, అసూయకు గురియైన మహాత్ములలో సంత్ ఏకనాథ్ ఒకడు.

మరాఠీ భాషలో రామాయణం వెలువడాలి అనేది పాండురంగ దేవుని సంకల్పం. ఏకనాథ్ చక్కని పనిముట్టు అయ్యాడు. భావార్థ రామాయణం దివ్యంగా ఆవిర్భవించింది. మహారాష్ట్ర ప్రజలకు విజ్ఞాన మణి దీపమై భాసించింది. సమాజంలో నూతన వెలుగుల్ని ఆవిష్కరించింది.

4. అధ్యాత్మ రామాయణము

'వ్యాసోచ్ఛిష్టం జగత్సర్వం' వ్యాసునికి తెలియని విషయం ప్రపంచంలో లేదని పండితుల మాట. నిజమే కదూ! భారత, భాగవత పురాణాది గ్రంథాలు రచించడమే గాక వేదాన్ని సంస్కరించి సంవిధాన మొనర్చిన ఘనత ఆయనకే దక్కింది. వ్యాస భగవానుని అపూర్వ సృష్టియే అధ్యాత్మ రామాయణము.

విభిన్న సిద్ధాంతాలతో, పాండిత్య వైషమ్యాలతో దారి తప్పిన సమాజాన్ని సక్రమ మార్గంలో ఉంచేందుకు రామాయణ రచనను ప్రత్యేకంగా ఎన్నుకున్నాడు వ్యాస భగవానుడు. సంస్కృత భాషలో రచించాడు.

తావ త్సర్వాణి శాస్త్రాణి వివదన్తే పరస్పరం
యావజ్జగతి నాధ్యాత్మ రామాయణ ముదేష్యతి!

'అధ్యాత్మ రామాయణము లోకంలో ప్రాచుర్యమును పొందనంతవరకే సర్వ శాస్త్రాలు పరస్పర వాదాలతో కలహించుకుంటూ ఉంటాయి' అని ప్రారంభ పలుకుల్లోనే పలికాడు వ్యాస భగవానుడు.

సంకుచిత భావాలతో అజ్ఞానారణ్యంలో సంచరిస్తున్న మానవ సమాజాన్ని విశాల భావ స్ఫూర్తితో విజ్ఞాన వీధులలో విహరింప చేయాలని సంకల్పించి ఈ రచనను వ్యాసుడు చేపట్టినట్లు తెలుస్తోంది. విజ్ఞానం ఉదయించిన చోట వికృతాలు, వైషమ్యాలు తలఎత్తవు కదా!

ప్రచరిష్యతి తల్లోకే ప్రాణ్యదృష్ట వశాద్యది
తస్యాధ్యయన మాత్రేణ జనాయాస్యన్తి సద్గతిం

'అధ్యాత్మ రామాయణ ప్రచారము జనుల అదృష్టము. ఈ గ్రంథమును అధ్యయనము చేసిన వారు సద్గతిని పొందుతారు' అన్నాడు వ్యాసభగవానుడు.

లోకం లోని దురదృష్టాన్ని, దుర్గతిని పోగొట్టే ప్రయత్నంలో వ్యాసభగవానుడు అధ్యాత్మ రామాయణాన్ని రచించాడు.

5. రంగనాథ రామాయణము

ఇది తెలుగులో ద్విపద కావ్యము. దీని రచయిత గోనబుద్ధారెడ్డి. 13 వ శతాబ్దములో ఈ రచనను చేసినట్లు తెలుస్తూ ఉంది.

తెలుగులో వెలువడిన రామాయణాలలో దీనికే అగ్రతాంబూలం అందింది. ద్విపద కావ్యమైనందున పాడుకోడానికి, చదువుకోడానికి అనువుగా ఉండి చక్కని ప్రాచుర్యాన్ని పొందింది. జనప్రియంగా సాగింది. స్త్రీలు ఇంటిపనులు చేసుకుంటూ పాడుకొనే రామాయణము ఇదే. తోలుబొమ్మలను ఆడించు వారు పాడేది రంగనాథ రామాయణమే.

6. గోపీనాథ రామాయణము

తెలుగులో వెలువడిన రామాయణాల్లో గోపీనాథ రామాయణము నాకు బాగా నచ్చిన గ్రంథము. దీని కర్త గోపీనాథము వేంకటకవి. ఇతడు వాల్మీకమును అనుసరిస్తూనే రచన సాగించాడు. గోపీనాథ రామాయణము వెలువడి వంద సంవత్సరాలే అయింది. తన గ్రంథాన్ని నరులకు అంకిత మివ్వకుండా శ్రీకృష్ణునికి సమర్పించిన భాగవతోత్తముడు గోపీనాథం వేంకటకవి.

7. మొల్ల రామాయణము

రామాయణము జనసామాన్యమునకు అందాలని కృషి చేసిన రచయితలలో నెల్లూరు మండలానికి చెందిన కవయిత్రి మొల్ల ఒకతె. రామాయణాన్ని పద్య గద్య కావ్యంగా ఈమె రచించింది.

గోపవరం గ్రామంలో వెలసియున్న శ్రీకంఠమల్లేశ్వర స్వామి అనుగ్రహంతో తాను రామాయణాన్ని రచిస్తున్నట్లు మొల్ల తన గ్రంథంలో పేర్కొన్నది. విద్యాసంపద తనకు లేదని వినయంగా చెప్పుకున్నది.

మల్లెల కన్నా తెల్లనైన మనసు గల మొల్ల నిర్మల రామభక్తితో రచించిన కావ్యమే మొల్ల రామాయణము.

కళ్యాణ గుణాభిరాము డైన శ్రీరామచంద్రుని సుగుణములకు సమ్మోహితులై, ఇలాంటి నాయకుడు దొరకుట అలభ్యమని భావించి, కొందరు కవులు తమ ప్రతిభతో రామకథను దివ్యంగా వర్ణించారు.

రఘువంశ కావ్యాన్ని వ్రాసిన మహాకవి కాళిదాసు రఘువంశీయుల సుగుణములే తన రచనకు ప్రేరకములని చెబుతాడు.

ఎందరు వ్రాసినా
ఎందరు చెప్పినా
ఎంతగా చెప్పినా
ఎన్నిసార్లు చెప్పినా

తనివి తీరనిది, నిత్యనూతన మైనది రామకథ.

బావుంది. ఇన్ని రామాయణాలు ఉండగా,

చైతన్య రామాయణము

ఎందుకు? ఎవరి కొరకు? ఏమి సాధించాలని?

రామకథారచన కార్యాన్ని జీవిత లక్ష్యంగా భావించి, రచించి, తరించిన మహానుభావు లెందరో ఈ పుణ్యభూమిలో.

అంతేకాదు. రామకార్యమే నిజమైన పని యని, తక్కినదంతా శని యని భావించిన వారూ ఉన్నారు.

ఇక, నా కథ


ఇది చైతన్య రామాయణం. రామ చైతన్యాన్ని వర్ణించే గ్రంథం. రామాయణ చైతన్యాన్ని వివరించే గ్రంథం.

నాకు దైవ నియోగం
మీకు ప్రసాద వినియోగం.
పైనుండి అందింది పిలుపు ... క్రింద అందించబోయేది మేలుకొలుపు.
మూడు దశాబ్దాలుగా చేసిన కొలువు
గ్రామ గ్రామాన కనుల పండుగగా సాగిన భక్తి చెలువు - ఏకమై నాకు ఈ రామాయణ రచనా భాగ్యాన్ని ప్రసాదించాయి.
కవినై వ్రాయలేదు.
పండితుణ్ణై ప్రవచించ లేదు.
తియ్యని రామకథను, పవిత్రమైన రాముని గాథను తెల్లని కాగితంపై వ్రాశాను. అంతే.
ప్రజాభాషలో వ్రాశాను. జనప్రియంగా చెప్పాను.
సరళభాషలో వ్రాశాను. వాడుక భాషలో వ్రాశాను. వేడుకగా వ్రాశాను. వేడుకుంటూ వ్రాశాను. నన్ను వాడుకోమంటూ వ్రాశాను.
శేముషీ సింధువునై వ్రాయలేదు. ఆర్తజన బంధువునై వ్రాశాను.
'నేనా! దద్దమ్మను. రామన్న కథ రాయడం నాకు సాధ్యమా!' అని పెద్దమ్మ పాదం పట్టుకున్నాను. అమ్మల గన్న అమ్మను వేడుకున్నాను.
దాశరథి గాథను దద్దరిల్లేలా వ్రాయమని పెద్దమ్మ ధైర్యాన్ని నూరిపోసింది.
నా అదృష్టానికి పొంగిపోతూ శతధా ధన్యుణ్ణై రచన కుపక్రమించాను.
ఇది సాహసమే నని నాకు తెలుసు.
గంగానదిని పూర్ణంగా ఆపోశనం పట్టాలని భావించే గోరువంక ప్రయత్నం అని నాకు తెలుసు.
అయినా ప్రారంభించాను. ప్రయత్నించాను.

త్రికరణ శుద్ధితో రామాయణాన్ని రచించే వారికి, అంబోధిని దాటిన ఆంజనేయుడు అండగా ఉంటాడనే మాట మీద విశ్వాస మున్నవాణ్ణి.



దైవకృప ఎలా ఉంటుందో జీవితంలో చూసిన వాణ్ణి.
రామాయణాన్ని కొందరు కథగా వ్రాశారు.
కొందరు మూలానికి శ్లోక తాత్పర్యాలు సమకూర్చారు.
కొందరు యథాతథంగా భావాన్ని అందించారు.
కావ్యంలోని కవితా పరిమళాన్ని కొందరు వెదజల్లారు.
నేను ఇవేమీ చేయలేకపోయాను.
మహిమను వర్ణించి మనిషిని తీర్చిదిద్దే ప్రయత్నం చేశాను.
అది నా జీవితలక్ష్యం. దైవశాసనం.
ఆంధ్రావనిలో నేడు నాకు ఉండేది ఊడే ఉద్యోగం కాదు. ఊరేగే ఉద్యమం. చూస్తూ నమ్మలేని సభలు.
సమయాల్ని పాటిస్తూ, నియమాల్ని అనుసరిస్తూ సకాలానికి సభాస్థలికి గలగలమంటూ నదిలా కదిలొచ్చే జనప్రవాహం.



ప్రసంగించినంత కాలం నిస్తరంగ జలధిలా నిశ్చేష్టులై కూర్చుని,
ఆశ్చర్యంతో
ఆర్ద్రతతో
ఆనందంతో
మూగబాధతో
పకపకమనే నవ్వులతో కొంతసేపు
తడి ఆరని కన్నులతో మరికొంతసేపు
రెండు గంటల్ని రెండు నిముషాలుగా భావించి
జీవిత లక్ష్యాన్ని, మార్గాన్ని పొందామనే తృప్తితో లేచిపోయే అశేష జనావళి నేడు ఆంధ్రావనిలో ఎక్కడైనా సుందర చైతన్య సభలలో ప్రత్యక్షం!
ఆహా! ఏమి వైభవం! ఏమి ప్రాభవం! ఎవరిది ఇదంతా!
ఇదంతా సనాతనధర్మ వైభవమే!
ఏనాటి పుణ్యఫలమో!
వాసుదేవుని కృపా వీక్షణమో,
వ్యాసవాల్మీకాదులు అభిషేకించిన పుణ్యతీర్థం నన్ను కరుణించింది.
తీర్థపుగిన్నె నా చేతికి వచ్చింది.
వినమ్రుడనై, వినీతుడనై వినియోగ భారాన్ని భుజాల కెత్తుకున్నాను. వితరణశీలి నయ్యాను.
నమ్మకమున్న వాణ్ణే గాని అమ్మకం తెలియని వాణ్ణి.

అయితే నేమి? అమ్మిపెట్టే వాడు అచ్యుతు డయ్యాడు.
వేడుకంతా వేదిక వద్దే.
చెప్పినట్లు చేయమన్న వాని చరిత్రను వ్రాసి మూడు సంవత్సరాల క్రితం విడుదల చేశాను.
వేలాది కాపీలు గంటలో ఎగిరి పోయాయి.
చేసినట్లు చేయమన్న వాని చరిత్రను ఇప్పుడు వ్రాస్తున్నాను. ముస్తాబు కాకముందే మాకంటే మాకని ముచ్చట పడుతున్నారు వేలాది మంది భక్తులు.
నమ్మి నడచిన బ్రతుకు వమ్ము కాదు.
జీవికి ఏనాడైనా ప్రధానమైంది సొమ్ము కాదు.
మూడు దశాబ్దాలు ఆంధ్రావనిలో గీతాప్రవచనం చేశాను. తేట తెలుగులో ఉపనిషత్తులు వినిపించాను. భాగవతామృతాన్ని త్రాగించాను. రామాయణ సాగరం వైపుకు నడిపించాను. **ఓం నమో భగవతే వాసుదేవాయ** అనే దివ్య ద్వాదశాక్షరీ మంత్రాన్ని మిన్ను ముట్టేలా వాడవాడలా ప్రతిధ్వనింప చేశాను.
సత్సంగాలు నెలకొల్పాను. సన్మార్గాన్ని బోధించాను. చేయవలసిన సందడి అంతా చేశాను.
మహర్షుల వైభవాన్ని దర్శించిన నా హృదయం విశ్రాంతిని విసర్జించింది. నిద్రను నిర్జించింది. ఆరోగ్యాన్ని విస్మరించింది.
నోరు మూతను పారేసుకుంది. కంఠం పగ్గాన్ని త్రెంచుకుంది. కాళ్ళు సంకెళ్ళను ఛేదించుకున్నాయి. చేతులు కట్లును వదిలించుకున్నాయి.
ప్రవచనాలు జోరుగా సాగాయి. పాటలు శ్రావ్యంగా క్యాసెట్ల కెక్కాయి. ఊరూరు ప్రయాణాలయ్యాయి. చాప పరచినట్లు గ్రంథాలు వెలువడ్డాయి.
పరిశ్రమ ఫలించింది. పరిస్థితి మారిపోయింది.
ఇంతకాలం విని ఆనందించిన వారందరు ఇక మీదట కని తృప్తి చెందాలని తపన చెందుతున్నారు. ధర్మ జీవనాన్ని గడిపేందుకు నడుం బిగిస్తున్నారు.
ఇప్పుడు రామాయణం వారికి చాలా అవసరమై ఉంది. ఈ క్షణం కొరకే వేచియున్న నేను కలం కదిలించి, రాత్రింబవళ్ళు శ్రమించి, సాధకజన లోకానికి రామాయణాన్ని అందించాలని సంకల్పించాను.
దానికి తోడు
ఈనాటి సమాజానికి రామాయణం అవసరం ఎంతో ఉంది.
తల్లిదండ్రుల మాట బిడ్డలు వినరు.
బిడ్డల భవిష్యత్తును తల్లిదండ్రులు పట్టించుకోరు.
భర్త మాట భార్య వినదు. భార్య సుఖాన్ని భర్త కనడు.
గురువులపై శిష్యులకు గౌరవం లేదు. శిష్యులపై గురువులకు వాత్సల్యం లేదు. స్నేహితుల మధ్య నమ్మకాలు నశించాయి. బంధువుల మధ్య దూరాలు పెరిగాయి. వ్యాపారాలు,

ఉద్యోగాలు, పాలకులు, పాలితులు - అంతా కాలుష్యమే. కాపట్యమే.ఈ వ్యసనాన్ని పారద్రోలి,
సద్వ్యవస్థను ఆహ్వానించాలని
ధర్మ వ్యవస్థను సమాజంలో ఆవిష్కరించాలని అభిలషించి, ఆశపడి
దేశకాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని
సామాజిక స్పృహను మదిలో నింపుకొని
అధఃపతన మవుతున్న ఆధునిక సమాజానికి
సనాతనధర్మ ప్రగతిని అందించాలని
అజ్ఞాన అనారోగ్యంతో నీరసించిన సమాజానికి
దివ్యారోగ్యాన్ని ప్రసాదించే జ్ఞానరక్తాన్ని ఎక్కించాలని, పట్టించాలని
పట్టుపట్టి, పట్టుదలతో రామాయణాన్ని రచించాను.
ఇది చైతన్య రామాయణం
భక్తులకు సారథి. విమర్శకులకు వారధి. సాధకులకు పెన్నిధి. నిజానికి రామప్రభువు సన్నిధి.
రామాయణంలో చైతన్యమూర్తి రామభద్రుడు.
చైతన్యునిలో అదృశ్య శక్తి శ్యామభద్రుడు.
కళ్ళ ముందు రాముడు
మనసు వెనుక శ్యాముడు
నేను మధ్యవర్తిని. మీకు మధ్యవర్తిని. మీ మధ్యవర్తిని.
చైతన్య రామాయణమంతా వాల్మీకమే.




అవాల్మీకాలు సుందరంగా గోచరించిన చోట వాటి చిరునామాలు తెలుపుకుంటూ నడిచాను.
రాముని ఆలయమే రామాయణం. అది భక్తుల పాలిటి దేవాలయం.
విగ్రహం రామునిది. ప్రతిష్ఠ వాల్మీకిది.
నా దేమిటంటారా? పరిచర్యలే. సేవలే.
మెట్లు శుభ్రం చేయడం, దారిని సుగమం చేయడం, సున్నం కొట్టడం,
రంగులు పులమడం - అంతే.
రాజు కట్టిన వంతెనపై ప్రాకి చీమ నదిని దాటుతుంది.
వాల్మీకి రామాయణాన్ని ఆశ్రయించి నేను నా కార్యాన్ని పూర్తి చేసుకున్నాను.
చీమకు చేవ ఎంతో - మీకు తెలుసు.
చైతన్యుని శక్తి అంతే - అని నాకు తెలుసు.
కృషి రవ్వంత. కృప కొండంత. అంతే అంతా.

నా సమస్యకు పరిష్కారం నేనే

స్వామి సుందర చైతన్యానంద

నీకు ఏముందో, ఏదుందో నాకు తెలియదు. నాకు ఏముందో, ఏదుందో నీకు తెలియదు. కాని, మనలో ఏదో తెలియని పోరాట ముందని, ఆరాట ముందని ఇద్దరికీ తెలుసు. అదేదో కాదు; పరిమిత జీవనము. నిత్యతృప్తికై పోరాటము. ఈ పోరాటము ఎవరి తోనో కాదు. దేనితోనో కాదు. నీతోనే. నాతోనే. ఆ పరిమిత దృక్పథము నీ మీదే, నా మీదే కేంద్రీకరింపబడి ఉంది. దీనిని తొలగించు కొనేందుకు ఏమి చేయాలి?



నీవు ఏది చేసినా, నీవు ఏది పొందినా అవి నీ పరిమిత మనుగడను దూరం చేయలేవు. ఏది పొందా లనుకున్నా అది నీకు బాహ్యంలో ఉన్నదే. సమస్య నీపై కేంద్రీకరింపబడి ఉండే టప్పుడు బాహ్యంలో నీవు ఏది పొందినా, అది నీ సమస్యకు పరిష్కారం కానే కాదు. నీవు సదా పరిమితుడు గానే ఉండి పోతావు. కనుక, బాహ్యానికి పరుగులు తీసే ప్రయత్నాలను దూరం చేసికొని, నిన్ను గూర్చి నీవు ఆలోచించుకోవడం ప్రారంభించాలి. ఇదే ఆత్మచింతనము.

దూరయాత్రాం ప్రయత్నేన వర్జయే దాత్మ చింతకః ।

'దూర ప్రయత్నాలను దూరం చేసుకొని, ఆత్మచింతన గావించుకోవా'లని ఉపనిషత్తు ప్రబోధించింది.

పరిమితుడుగా ఉన్నాను. అలా ఉండటం నాకు ఇష్టం లేదు. నాకే కాదు; ఎవరికీ లేదు. ఈ స్థితి నుండి విడుదల కావాలి. ఇది మనందరి కోరిక. కోరిక సహజ మైనపుడు, అది తీరే పద్ధతి కూడా సహజం గానే ఉంటుంది. ఉండాలి.

మనకు ఆకలుంది. దాహముంది. ఇవి సహజంగా ఉన్నాయి. వాటిని తీర్చుకొనే పద్ధతి కూడా సహజంగా ఉంది. పరిమిత జీవనము నుండి విడిపడాలి అనేది కూడా సహజమే అయితే, దాని పరిష్కారం కూడా సహజం గానే ఉండాలి. కాని, అది అలా లేదు.

పరిమిత జీవనము నా మీద కేంద్రీకరింపబడి ఉంది. కనుక నేనే సమస్య. సమస్య నే నైనపుడు పరిష్కారం నా కన్నా అన్యమైన వాటిలో ఉండే అవకాశం లేదు. కనుక, నాకు సంబంధించిన పరిష్కారం నా వద్దే ఉండాలి. ఉంది.

నేను ఉన్నాను. కాని, నే నేమిటో నాకు అర్థం కావడం లేదు. నేను నాకు ఎలా

తెలుస్తున్నానో అది సరియైన అవగాహన కాదు. ఇలాంటి అవగాహన ఏర్పడటానికి కారణ ముండాలి. అదేమిటి? ఏమో, తెలియదు.

కాని, ఇక్కడ ఒక్క విషయము నన్ను తికమక పెడుతోంది. ఒక వైపు పరిమిత జీవనాన్ని సాగిస్తున్నా, అప్పుడప్పుడు నేను ఆనందంగా ఉండటం నా అనుభవంలో గోచరిస్తూ ఉంది. దీనిని బట్టి నాకు ఒక్క విషయం అర్థమవుతూ ఉంది. నేను ఆనందంగా ఉండటానికి నా ఆశలన్నీ తీరాల్సిన అవసరం లేదేమో అని. కోరికలు తీరక పోయినా నేను ఆనందంగా ఉండవచ్చు అని. ఇదే వాస్తవమైతే, నా పరిస్థితులు ఎలా ఉన్నా, నా దేహేంద్రియ మనోబుద్ధులు ఎలా ఉన్నా, వాటిలో ఏ మార్పును ఆశించకుండా నేను ఆనందంగా ఉండవచ్చు. అలాగైతే, నేను ఆశించే ఆనందము నాకు లభించినట్లే కదా! ఇదే వాస్తవమైతే, నేను ఆనందంగా ఉండటానికి నా కోర్కెలు తీరాల్సిన అవసరం లేదు కదా! నా పరిమిత జీవనము అదృశ్యం కానవసరం లేదు కదా!

కించిచ్చే ద్రోచతే తుభ్యం తద్బద్ధోఽసి భవస్థితౌ ।
న కించి ద్రోచతే చేత్తే తన్ముక్తోఽసి భవిస్థితౌ ॥

'బాహ్యంలో ఏ కొంచమైనా నీకు రుచించినచో, నీవు సంసారంలో బద్ధుడవు. దృశ్య వస్తువు ఏదైనా కొంచెమైనను రుచించక ఉండినచో నీవు సంసారమున ముక్తుడవు' అన్నది ఉపనిషత్తు. వేదాంతం ఇక్కడే సూటిగా ఒక ప్రశ్న సంధిస్తోంది. ప్రపంచంలో ఏదైనా సరిగా లేకపోతే, దానిని అలా ఉండనీ. నేను సరిగ లేను అని నీ వెందుకు అనుకుంటున్నావు? సరిగ లేనని ఎందుకు బాధ పడుతున్నావు?

నే నేమిటి? నేను దేహమే కదా? మనసే కదా? సంసారమే కదా? ఆర్థిక పరిస్థితులే కదా? సామాజిక గుర్తింపే కదా? నేను నేనుగా ఉండటానికి కారణ మైనవి అవే కదా! అలాంటివి సరిగా లేనపుడు నేనెలా సరిగా ఉంటాను? అనేది నీ పూర్వపక్షం కావచ్చు.

అవన్నీ నీకు ఉండొచ్చు. నీవు అవి ఎలా అవుతావు? నీవు అవే అయితే, వాటిలో ఏది లోపించినా నీవు లేకుండా పోవాలి. అవునా! నీవు అలా లేకుండా పోతున్నావా? అదే జరిగితే నీకు ఉనికే లేకుండా పోతుంది. నీవు వ్యక్తివి కాకుండా పోతావు. అలా కాకుండా వాటికి భిన్నంగా నీ ఉనికి ఉంటే, అవేవీ బాగలేక పోయినా, నీవు బాగానే ఉండాలి. వాటి ప్రభావం నీ మీద ఉండటానికి వీలు లేదు. అర్థమైందా? ఇక్కడే, నీ వేమిటో నీకు అర్థం కావడం లేదు. నీకు సంబంధించిన గందరగోళం నిన్ను కలత పెడుతోంది. ఇదీ నీ సమస్య. అదే నా సమస్య. నీకు సంబంధం లేనివి నీపై నీవు ఆరోపించు కుంటున్నావు. నాకు సంబంధం లేని వాటిని నాపై నేను ఆరోపించు కుంటున్నాను. ఇదే మన సమస్య. ఈ ఆరాటము తీరేది కాదు. ఈ పోరాటము ఆగేది కాదు. ఇది ఇలాగే కొనసాగితే, మిగిలేది అపజయమే.

కాని, వేదాంతం ఈ విషయాన్ని అంగీకరించదు. నీవు ఆత్మవు. ఆత్మ ఏకమే గాని అనేకము కాదు. నీవు పోరాడాలంటే అనేకము ఉండాలి. నీవు పరమే గాని అనేకము కాదు. ఇది నీకు అర్థమైతే, పోరాటము అనూహ్యము. అనూహ్యమైన పోరాటంలో అపజయ మెక్కడిది? అపజయమే లేనపుడు, కరోనా నిన్నెలా జయిస్తుంది?

ఇంతకీ మన వాంఛ ఏమిటి? మనం పూర్ణం కావాలి. పూర్ణంగా ఉండాలి. అది నేనే. నేనే పూర్ణం. నేను ఏది కోరినా, దాని ఫలితంగా నేను ఆశించేది పూర్ణమే. **ఆత్మనస్తు కామాయ సర్వం ప్రియం భవతి** – 'ఏదైనా ఆత్మార్థమే మనిషికి ప్రియంగా ఉన్నది' అని ఉపనిషత్తు. మరి నేను వాంఛించే ఆ పూర్ణము పరిమితం కాగలదా? పరిమితమైతే, నేను కోరేది అపూర్ణ మవుతుంది. అపూర్ణమైన దేదో అది అన్య విషయాలపై ఆధారపడి ఉంటుంది. అలాంటిది ఎలా పూర్ణ మవుతుంది? అలాంటిది మనం ఆశించడం లేదు. నిరాధారము, సర్వాధారమైన పూర్ణాన్నే మనం వాంఛిస్తున్నాం.

అపూర్ణమే నా స్వభావమైతే, స్వరూపమైతే, నేను నేనుగా ఆనందంగా ఉండగలను. ఎందుకు ఉండలేక పోతున్నాను? అపూర్ణము నా స్వరూపము కాదు. ఇది నా సమస్య. పూర్ణమే నా స్వరూపము. నా సమస్యకు పరిష్కారము నేనే.

సమస్య అర్థమైందా? నేను పొందాలనుకొనేది నా కన్నా అన్యమైనది కాదు. నా కన్నా వేరుగా ఉండేది కాదు. నేను ప్రత్యేకంగా పొందేది అసలే కాదు. నేను దేనిని పొందా లనుకుంటున్నానో తెలుసా? నేను ఏదిగా ఉండిపోవా లనుకుంటున్నానో, దానినే నేను పొందా లనుకుంటున్నాను. నేను కోరుకునేది నన్నే. నన్ను పొందటానికి నేను చేయవలసింది ఏముంది?

ఏమి చేయకుండా నేను నేనుగా ఉండగలను. అదే పూర్ణము. అది ఉన్నదే. నాకు అర్థం కాకపోడమే సమస్య. నేను నాకు అర్థం కావడమే పరిష్కారము. ఇది అర్థమైతే, నేను దేనిని పొంద నవసరం లేదు. నేను ఆశించేది పొంది యున్నదే. ప్రాప్తించి యున్నదే. నేను వెతికేది నన్నే. నేను నాలోనే ఉన్నాను. ఇదే నా సమస్యకు పరిష్కారము. మనిషి పొందా లనుకున్నది పొందే ఉన్నప్పుడు, ఇక సమస్య ఏముంది? అలా పొంది ఉన్నట్లు తెలియక పోవడమే సమస్య. అదే అజ్ఞానమంటే. అజ్ఞానము ఎలా పోతుంది? జ్ఞానం వల్లనే పోతుంది. నాకు సంబంధించిన జ్ఞానము లేకపోవడము నా అజ్ఞానము. అదే నా సమస్య. నాకు సంబంధించిన జ్ఞానము నాకు కలగటమే దానికి పరిష్కారము. అదే జ్ఞానము.

ఏకం బ్రహ్మోహ మస్మీతి కృతకృత్యో భవేత్ ।

'ఏకమైన బ్రహ్మమే నేను అని భావించి కృతకృత్యు డవుతున్నాడు' అన్నది ఉపనిషత్తు.

ఆసక్తికరమైన లేఖ

ఆత్మబంధువులారా!

శ్రీ స్వామీజీకి చిన్నతనంలో చదువు చెప్పిన మాష్టారు వ్రాసిన ఉత్తరము, దానికి పూజ్య స్వామీజీ ఇచ్చిన సమాధానమును ప్రచురించు చున్నాము. ఈ రెండు ఉత్తరములు సర్వులకు ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉన్నందున శ్రీ స్వామీజీ అనుమతితో 'గిరిధారి' పాఠకులకు అందిస్తున్నాము.

'గిరిధారి' కార్యాలయం

వెంకటగిరి

16-2-1990

మహారాజ రాజ శ్రీశ్రీశ్రీ స్వామి సుందర చైతన్యానంద గారి దివ్య సముఖమునకు, బి.వెంకట గోపాల్ అయ్యవారు వ్రాయు ఉత్తరము. ఉభయ కుశలోపరి.

నేటి 'ఈనాడు' దినపత్రిక 'నెల్లూర్ న్యూస్' నందు మీ ఛాయా చిత్రమును చూచి, తమ నెల్లూరు - ఇందిరా భవన్ నందలి శనివారం నాటి కార్యక్రమమును చదివి ఆనందించడమే కాదు, చాలా గర్వ పడుతున్నాను.

శ్రీవారి ఉపన్యాసాన్ని వినాలనే ఉత్సాహం ఉంది. కానీ ప్రస్తుతం నా ఆరోగ్యం బాగాలేదు. కంటి ఆపరేషన్ చేసికొని ఉన్నాను. కదలరాదని డాక్టర్ గారి సలహా. కాబట్టి తమర్ని దర్శించి, తమ బంగారు మాటలు వినే భాగ్యం లేకుండా పోయింది.

మార్చిలో గాని, ఏప్రిల్‌లో గాని మీ కార్యక్రమాలు నెల్లూరు నందున్న, నా యందు దయ ఉంచి తెలుపవలసినదిగా మరీ మరీ కోరుతున్నాను. నా కోరికను మన్నించ ప్రార్థన.


మీ ఆజ్ఞ కొరకు నిరీక్షించు

బి. వెంకట గోపాల్

స్వామీజీ సమాధానం

ఆశ్రమం

20-2-1990



పూజ్యులు శ్రీ వెంకటగోపాల్ అయ్యవారికి

భక్తి పూర్వక వందనములు.

హరిః ఓం. ఓం నమో నారాయణాయ.

మీ ఉత్తరము అందినది. కొన్ని నిముషాలు నా హృదయం అనిర్వచనీయమైన ఆనంద పారవశ్యాన్ని అనుభవించింది.

అక్షర రూపుడైన పరమాత్మను తెలిపే గురువును పొందగలిగే భాగ్యం నా జీవితంలో కలుగలేదు. కానీ తెలిసిన అక్షరాల మధ్య తెలియని అక్షర మూర్తిని నిర్విరామంగా అన్వేషించాను. ఏదో దారి, దరి దొరికినట్లే తృప్తి చెంది ఉన్నాను.

కానీ . . .

హృది లోని అక్షరరూపుని వెదికేందుకు సహకరించే అక్షరాలను మదిలో నిలిపిన మాననీయులలో మీరొకరు. నా హృదయంలో మీ స్థానం ఎన్నటికీ చెదరదు.

నేను ఎప్పటికీ మరువలేని సంఘటన, **1958**వ సంవత్సరము. పాతకోటలో మీరు ట్యూషన్ చెబుతున్న గది లోకి నన్ను వెంటబెట్టుకొని మా నాన్న ప్రవేశించారు. మా తండ్రి గారిని చూడగానే మీరు లేచి నిలబడి నమస్కరించారు. రాక కారణాన్ని మీరు ప్రశ్నించే లోగా వచ్చిన కార్యాన్ని మా తండ్రి వివరించారు.

'ఈ అబ్బాయి నా రెండవ కుమారుడు. పేరు సుందర రాజన్. మీరు పని చేసే హైస్కూలులో చదువుతున్నాడు. తెలివి గల కుర్రవాడు. ఎందుకో, గణితమంటే భయం. మీరు మా అబ్బాయికి ట్యూషన్ చెప్పాలి'.

ఆ సందర్భములో మీరు పలికిన మాటలు ఇంకా నా చెవుల్లో నిలిచి ఉన్నాయి. 'సార్! మీరు నాకు చదువు చెప్పారు. మీ అబ్బాయికి చదువు చెప్పడం నా అదృష్టం' అన్నారు. అలాగే ఆ సంవత్సరమంతా గణితం బోధించారు. దక్షిణ కూడా అంగీకరించ లేదు. ఈనాటికి ఈ ఉత్తరమే దక్షిణగా సమర్పిస్తున్నాను.

బాల్యము నుండి భగవంతుని కొరకు నేను ఎలా శ్రమించానో మీకు తెలుసు. నా శ్రమలు వృథా కాలేదు. నా ప్రార్థనలను పరమాత్మ విన్నాడు. నా ద్వారా లోక కళ్యాణానికి ఏదో జరుగుతుందని, జరుగవలెనని కాంక్షించిన పవిత్రాత్ములలో మీరూ ఒకరు. మీ ఆశలు వమ్ము కాలేదని అవి శోభాయమానంగా ఫలప్రదమైనవని సవినయంగా మనవి చేయుచున్నాను.

ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోండి. ఈసారి నేను నెల్లూరు వచ్చే ముందుగా మీకు తెలియపరుస్తాను. నిర్విరామంగా సమాజసేవలో నిమగ్నమై యున్నను నా వ్యక్తిగత సాధన నిరాటంకముగా సాగుచునే యున్నది. భగవత్కృప, మీలాంటి పెద్దల ఆశీస్సులు నన్ను సదా కాపాడుతూనే ఉంటాయని నా ప్రగాఢ విశ్వాసము.

మీరు భగవన్నామ రుచి నెరిగినవారే అన్న సంగతి నాకు విదితమే. నాలుకపై నామం కదులుతూ ఉంటే హృదయంలో పరమాత్మ తిష్ఠ వేసి ఉంటాడు. పదవీ విరమణ చేసి విశ్రాంతి తీసుకొనుచున్న మీకు నామ సాధనలో నిరంతరం తృప్తి చెందే దివ్యావకాశాన్ని పరమాత్మ ప్రసాదించాడని నా నమ్మకము.

నేను రచించిన గ్రంథములు, గానం చేసిన క్యాసెట్లు త్వరలో మీకు చేరేలా చూస్తాను. నన్ను నేను ఆ విధంగా మీ వద్ద ఉంచుకుంటాను. శెలవు.

ప్రణామములతో

ॐ స్వామి సుందర చైతన్యానంద

సంతాపము



శ్రీమతి ఎల్.పద్మావతి
ఆశ్రమం



సందేహాలు - సమాధానాలు



(1) స్వామీజీ! ప్రణామం. తండ్రి వ్యసనములకు బానిసయై, ఆస్తిని హారతి కర్పూరంలా చేస్తూ, కుటుంబాన్ని పూర్తిగా విస్మరించి, ఏ బాధ్యతలు నిర్వహించకుండా ఉంటే, అట్టి వ్యక్తి యొక్క కుమారుని కర్తవ్య మేమిటి?

అద్దాన్ని చూసి ముఖాన్ని సరిచేసుకున్నట్లు, తండ్రి లోని పతనాన్ని గుర్తించి తాను ప్రగతి మార్గం వైపునకు నడక సాగించడమే. తండ్రి అసభ్య వర్తనము బిడ్డను కలతకు గురి చేసినట్లు, బిడ్డ యొక్క ఋజువర్తనము తండ్రికి సన్మార్గమును అందించవచ్చు. అరుపుల కన్నా, ఆదేశాల కన్నా ఆదరణే సద్యః ఫలితాల నిస్తుంది.

(2) స్వామీజీ! ఒక వైపు గీత, రామాయణాది గ్రంథాలను చదువుతూ, వింటూ, మరొక వైపు ప్రాపంచిక విషయాలలో తల దూర్చి స్వార్థం కోసం ప్రాకులాడే వారికి ముమ్ముందు ఏం జరుగుతుందో తెలియజేయండి.

నాయనా! కంటక మార్గంలో చరించే వారికి ఏమి జరుగుతుంది? ఉప్పు తిని నీళ్ళు త్రాగకుండా ఎవరుండగలరు? కానీ ఒక్క విషయం. మనం ఈ ప్రపంచానికి వచ్చింది ఇతరులను గూర్చి ఆరాలు తీసేందుకు కాదు. కారాలు నూరేందుకూ కాదు. మంచిని వరించకపోతే వారు సద్గ్రంథా లెందుకు పఠిస్తారు? ఆచరణలో స్థిరపడే సంస్కారం వారికి చాలినంతగా లేదు. అంతే. ప్రయత్నంలో అదీ సాధించగలరు. వక్ర రేఖలను తుడుపుకో గలరు. ఈ లోగా వారికి మన నుండి కావలసింది విమర్శలు కావు. పరామర్శలు. సానుభూతులు.

(3) అయ్యా! తమరి ఉపన్యాసముల నాలకించి సన్మార్గములో నడుస్తూ, ఎన్ని కష్టాలు ఎదురైనా ఎవరికీ అన్యాయం చేయకుండా భగవన్నామ స్మరణ చేసుకొంటూ జీవించే వారికి బాధలు తీరడం లేదు. ఇబ్బందులు దూరం కావడం లేదు. కారణ మేమిటి?

తల్లీ! ఔషధం నేడు పుచ్చుకోవచ్చు. కానీ, అనారోగ్యం ఈనాటిది కాదు. కర్మానుగతంగా

బాధలు ఎదురౌతున్నాయి. చేసిన పుణ్యానికి బోధలు లభిస్తున్నాయి. మురికి నిండిన పాత్రను కొళాయి క్రింద ఉంచి నీరు పడుతున్నాము. నిండిన పాత్ర నుండి నీరు పొరలుతూ ఉంటే మురికి కూడా పొరలి పోతూ ఉంది. కొంతసేపటికి శుద్ధ జలమే మిగులుతుంది.

బోధలు బాధలను తొలగించే పైరవీలు కావు. బాధలను భరించే శక్తి నిచ్చు నేస్తాలు. బాధలు బ్రతుకుకు వెలుగులను ప్రసాదిస్తాయి. వైరాగ్యమును అందిస్తాయి. కర్తవ్యమును ముందుంచుతాయి. గతంలో దొర్లిన పొరపాట్లను చూపిస్తాయి. భావిలో గ్రహపాట్లు లేకుండా జాగ్రత్త పడేలా చేస్తాయి. బాధల దావాగ్నిని బోధల వర్షంలో ఆరిపోనీ. ఆవిరై పోనీ. పోలీసు మన ప్రక్కనుంటే చోరుడు మనలను సమీపించలేడు. భగవన్నామం మన అధీనంలో ఉంటే ఆవేదనలు దరి చేరలేక పారిపోతాయి.

(4) పూజ్య స్వామీజీ! భగవద్గీత లోని రాజవిద్యా రాజగుహ్య యోగం నాల్గవ శ్లోకంలో భగవానుడు 'సమస్త ప్రాణికోట్లు నా యందున్నవి. నేను వాని యందు లేను' అని చెబుతాడు. వెంటనే ఐదవ శ్లోకంలో 'భూతములు నా యందు లేవు' అంటాడు. పరస్పర విరుద్ధమైన ఈ విషయాలను ఎలా అర్థం చేసుకోవాలి?

నాయనా! చక్కని ప్రశ్న అడిగావు. గీతామాత ఔన్నత్యాన్ని, ప్రభావమును ప్రదర్శించేందుకు, ప్రకటించేందుకే ఇలాంటి విషయాలు నిలిచి వెలుగుతున్నాయి. భక్తి శ్రద్ధలతో అర్థం చేసుకో!

నాల్గవ శ్లోకంలో - ***మత్థ్సాని సర్వభూతాని న చాహం తేష్వవస్థితః'***- 'సర్వభూతములు నా యందున్నవి. నేను వాని యందు లేను', అని భగవానువాచ.

పరిమితమైన వాని యందు అపరిమితమైన వస్తువు ఎలా ఉండగలదు? సాగరాన్ని కుండలో బంధించగలమా? ఇక్కడ భిన్నత్వంలో ఏకత్వం ప్రతిపాదించ బడుతున్నది.

అలలు సముద్రంలో ఉన్నాయి. కానీ సముద్రం అలల యందు లేదు. పరమాత్మ కూడా అంతే. తరంగాలకు సాగరం ఆధారమైనట్లు సర్వ భూతాలకు పరమాత్మ ఆధారమై ఉన్నాడు.

త్రాడులో పాము గోచరించినపుడు ఉన్న త్రాటిలో లేని పాము తెలిసిందే గాని పాములో త్రాడు ప్రవేశించలేదు. ఆలోచించు. ఇకపోతే ఐదవ శ్లోకంలో

న చ మత్థ్సాని భూతాని పశ్యమే యోగ మైశ్వరమ్ - 'భూతములు నా యందు లేవు. నా దివ్యమైన యోగమును గాంచుము', అంటాడు పరమాత్మ.

అనంతమైన వస్తువులో పరిమిత వస్తువులు ఉండేందుకు వీలు లేదు. అలా ఉంటే అనంతమైన వస్తువు పరిమిత మౌతుంది. ఇక్కడ భిన్నత్వం నిరాకరింపబడి ఏకత్వమే ప్రతిపాదించ బడుతున్నది. సముద్రంలో అల ప్రత్యేకంగా ఉందా? సముద్రమే అలల రూపంలో తెలియబడుతూ ఉంది. ఉన్నది నీరు మాత్రమే.

త్రాడులో పాము ఎక్కడ ఉంది? ఉన్నది త్రాడు మాత్రమే. ఉన్నది లేకుండా పోదు. లేనిది ఉండే దుండదు. ఆలోచించు.

నాల్గవ శ్లోకం సత్యసౌధాన్ని అధిరోహించడానికి సోపానాన్ని నిర్మించింది. ఐదవ శ్లోకం సత్యదర్శనం చేయించింది. తయారైన వంటను ఆరగించేటట్లు చేసేందుకు నాల్గవ శ్లోకం యత్నిస్తుంది. ఆరగించిన వంట వంటబట్టేలా చేసేందుకు ఐదవ శ్లోకం ప్రయత్నిస్తూ ఉంది. ఈ రెండు శ్లోకాలు పరస్పరాధీనములే గాని పరస్పర విరుద్ధములు కావు. అన్యోన్యాశ్రయాలే గాని అసంగత పలుకులు కావు. అందుచేతనే ఐదవ శ్లోకంలో 'నా దివ్యమైన యోగమును గాంచుము' అని పరమాత్మ సందేశము నందించాడు.

ఇంకా లోతుగా అర్థం చేసుకుంటావా? అయితే విను. కలగంటున్నప్పుడు కలలో అనేక వస్తువులు గోచరిస్తాయి. కలలోని ఆయా వస్తువులు కలగనే వానిలోనే తెలిసాయి. కానీ కలను అనుభవించువాడు ఆయా వస్తువులకు పరిమితుడా? ఆలోచించు. ఇది నాల్గవ శ్లోకాన్ని అర్థం చేసుకొనే పద్ధతి. ఇక తరువాత, నిద్రించువాడు మేల్కొనుట జరిగింది. ఇప్పుడు కలలోని వస్తువులు, విషయాలు ఉన్నాయా? లేక ఒకప్పుడు ఉండినవా? మేల్కొనిన వాడు 'స్వప్నగత విషయాలు నా యందు లేనివే' అంటాడు. ఇది ఐదవ శ్లోకమును గ్రహించే విధానము. ఓం. ఓం. ఓం.

(17వ పేజీ తరువాయి)

మండనమిశ్రుడు సురేశ్వరాచార్యులైన తరువాత అలౌకిక పాండిత్యముతో అనేక గ్రంథాలు రచించారు. గురుదేవులగు శ్రీ శంకరుల ఆజ్ఞానుసారము ఉపనిషద్భాష్యములపై వార్తికములను రచించారు. నైష్కర్మ్య సిద్ధి* అనెడి గ్రంథము వీరి రచనలలో చాలా ప్రౌఢమైనది. శ్రీ శంకరుల దక్షిణామూర్తి స్తోత్రమునకు వీరు రచించిన 'మానసోల్లాసము' అనెడి వార్తికము గొప్ప ప్రాచుర్యము నొందినది. తైత్తిరీయోపనిషద్భాష్య వార్తికము, బృహదారణ్యక భాష్య వార్తికము, కాశీ మృతిమోక్ష విచారము మున్నగు గ్రంథములు సురేశ్వరుల విఖ్యాత రచనలు. వేదాంత శాస్త్రేతిహాసములో 'వార్తికాకారుడు' అనే పేరు వీరికే దక్కింది. వేదాంత శాస్త్రము నందే గాక ధర్మశాస్త్రము నందు కూడా సురేశ్వరులు గొప్ప నిష్ణాతులు.

ఓం తత్ సత్

సమాప్తం

*('నైష్కర్మ్య సిద్ధి'కి విద్యా సురభి అను వ్యాఖ్య ప్రశస్తము. దీని రచయిత జ్ఞానామృత యతి).



చైతన్య ప్రభంజనం

శ్రీ డి.వి.ఎన్.మల్లికార్జున శర్మ

తత్త్వబోధ

శ్రీశ్రీశ్రీ స్వామి సుందర చైతన్యానంద సద్గురుదేవులు, జనవరి 25, 2026 ఆదివారం ఉదయం 9.30 నుండి హైదరాబాదు లోని సుందర చైతన్యాశ్రమంలో శ్రీ ఆదిశంకర భగవత్పాద విరచిత 'తత్త్వబోధ'పై బోధనా తరగతుల ప్రారంభానికి శ్రీకారం చుట్టారు. జిజ్ఞాసువులైన ముముక్షువులంతా ఈ దివ్య జ్ఞాన బోధకు ఆహ్వానితులే కావటం ఈ తరగతుల ప్రత్యేక విశేషంగా పూజ్య గురుదేవులు అనుగ్రహించారు.

పూజ్య గురుదేవులు అపారమైన శంకర వాఙ్మయాన్ని కొన్ని తరాల ముముక్షువులకు బోధించి ఆశీర్వదించారు. ఆ వాఙ్మయంలో భగవద్గీతా భాష్యం, బ్రహ్మసూత్ర భాష్యం (చతుస్సూత్రీ) వంటి బృహద్రచనలే గాక వేదాంత శాస్త్ర అవగాహనకు అత్యవసరమైన పారిభాషిక పదాల నిర్వచనాలను అద్వైత తత్త్వాన్ని మేళవించి బోధించే ప్రాథమిక పాఠ్య గ్రంథమైన 'తత్త్వబోధ' అతి ముఖ్యమైనది.

ఒక దశాబ్దం క్రిందట పూజ్య గురుదేవులు 'తత్త్వబోధ'ను మోక్షధామం సభ్యులకు 1.3.2015 నుండి రెండు నెలల పాటు బోధించారు. అంతవరకు గ్రంథ రూపంలో అందుబాటులో ఉన్న 'చైతన్య భగవద్గీత'ను ప్రవచన రూపంలో కూడా అనుగ్రహించడానికి ముందు పునాది తరగతులుగా పూజ్య గురుదేవులు 'తత్త్వబోధ'ను విపులంగా బోధించారు.

ఈ దశాబ్ద కాలంలో చోటు చేసుకున్న అనేక మార్పులు, సాంకేతిక ప్రగతి, గణనీయంగా పెరిగిన 'మోక్షధామ' సభ్యుల సంఖ్య మొదలైన అంశాల దృష్ట్యా పూజ్య గురుదేవులు ఈ ప్రత్యేక తరగతులకు అందరినీ అనుమతించడం, ఏ వారానికి ఆ వారం ప్రవచనాన్ని 'యూట్యూబ్'లో పెట్టడం వంటి నిర్ణయాలు తీసుకోవడం సాధక లోకంపై పూజ్య గురుదేవులకు గల వాత్సల్యానికి తార్కాణం!

పూజ్య గురుదేవుల అనితరసాధ్యమైన బోధనా విధానం కారణంగా కేవలం ప్రశ్నోత్తర రూపంగా నిర్వచనాలతో సాగిపోయే ఈ గ్రంథ బోధన చైతన్య గానమయంగా, ఆసక్తికరమైన ఆఖ్యాయికా సహితంగా, భగవద్గీతాది ఇతర శాస్త్ర గ్రంథాల ప్రస్తావనలతో మరీ ముఖ్యంగా ప్రవచన తరగతులు ఆద్యంతాలలో కమనీయమైన చైతన్య భజనలతో ఒక్కొక్క తరగతి

ఒక్కొక్క దివ్యానుభవంగా శోభించడం కేవలం గురుకృపా విశేషం! ఈ కారణం వల్ల ప్రతి ఆదివారం ఉదయం 'శ్రుతిమందిరం'లో శ్రోతల సంఖ్య పెరుగుతూండగా 'యూట్యూబ్' వీక్షణల సంఖ్య వేల సంఖ్యలో నమోదు అవుతోంది. ఇలా ప్రజల్లో వేదాంత జిజ్ఞాసను సద్గురువులు, జగద్గురువులు పెంపు చేసే దిశగా మార్గదర్శనం గావించడం ఈ తరం చేసుకున్న పుణ్యఫలంగా భావించవచ్చు.

గహనమైన అద్వైత వేదాంత శాస్త్ర అధ్యయనానికి, తత్సంబంధిత పారిభాషిక పదజాలంతో పరిచయం, సంపూర్ణ అవగాహన అత్యంత కీలకమని తెలియజేస్తూ పూజ్య గురుదేవులు అనేకమార్లు ఈ గ్రంథాన్ని వివిధ తరాల జిజ్ఞాసువులకు బోధించి అనుగ్రహించారు.

సాంకేతికత అంతగా అభివృద్ధి చెందని రోజుల నుండి నేటి వరకు పూజ్య గురుదేవులు ఈ శాస్త్ర గ్రంథాన్ని వివిధ బోధనా పరికరాలను వినియోగిస్తూ శాస్త్ర పరిజ్ఞానాన్ని వితరణ చేయటం ఆదిశంకర భగవత్పాదులకు అత్యంత అరుదైన నివాళిగా భావించవచ్చు.

పాతికేళ్ళ క్రితం హైదరాబాదు శివారు గ్రామం 'జీడిమెట్ల'లో ఇదే గ్రంథాన్ని ప్రకృతి ఒడిలో పూజ్య గురుదేవులు బోధించిన నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఆ తరం ముముక్షువులు నేటి తరంతో పోటీ పడుతూ ఇప్పటి తరగతులకు కూడా ఉత్సాహంగా హాజరు కావడం పూజ్య గురుదేవుల దివ్య కటాక్ష వీక్షణ ఫలం!

పూజ్య గురుదేవుల 78వ జయంతి ఉత్సవాలు గత సంవత్సరం డిసెంబరులో ఒక జ్ఞానయజ్ఞం వలె అత్యంత వైభవోపేతంగా జరిగిన అనతి కాలంలో పూజ్య గురుదేవులు 'తత్త్వబోధ'ను తమ ప్రసన్న గంభీర స్వర మాధురితో అనుగ్రహించడం, అశేష సాధకలోకం ఈ గురుకృపను సద్వినియోగం చేసుకోవడం తెలుగు ప్రజలకు ఆధ్యాత్మిక రంగంలో గొప్ప పరిణామం!

(సర్వమ్ శ్రీశ్రీశ్రీ స్వామి సుందర చైతన్యానంద సద్గురు దివ్య చరణారవిందార్పణ మస్తు!)

హరిః ఓం తత్ సత్



(ప్రకటన వివరణ ఫారం 4 - రూల్ 8)

గిరిధారి

ఆధ్యాత్మిక మాసపత్రిక

1. ప్రచురణ స్థలము : సుందర చైతన్య ఆశ్రమం, సర్వే నంబరు-563, దుండిగల్, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా తెలంగాణ - 500 043

2. ప్రచురణ కాలము : ప్రతి నెల 1 వ తేది

3. ముద్రణకర్త పేరు : సుందర చైతన్యానంద
రాష్ట్రీయత : భారతీయులు
చిరునామా : సుందర చైతన్య ఆశ్రమం, సర్వే నంబరు-563, దుండిగల్, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, తెలంగాణ - 500 043

4. ప్రచురణకర్త పేరు : సుందర చైతన్యానంద
రాష్ట్రీయత : భారతీయులు
చిరునామా : సుందర చైతన్య ఆశ్రమం, సర్వే నంబరు-563, దుండిగల్, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, తెలంగాణ - 500 043

5. సంపాదకుని పేరు : సుందర చైతన్యానంద
రాష్ట్రీయత : భారతీయులు
చిరునామా : సుందర చైతన్య ఆశ్రమం, సర్వే నంబరు-563, దుండిగల్, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, తెలంగాణ - 500 043

6. పత్రిక యజమానులు : సుందర చైతన్యానంద, సర్వజ్ఞ కల్చరల్ ట్రస్టు, సర్వే నంబరు-563, దుండిగల్, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, తెలంగాణ - 500 043

పైన తెలిపిన వివరములు నాకు తెలిసినంత వరకు యదార్థమైనవను నమ్మకముతో ప్రకటించుచున్నాను.

ఇట్లు,
స్వామి సుందర చైతన్యానంద
ప్రచురణ కర్త

సుందర చైతన్యాశ్రమం
01-03-2026

రాజపోషకులు
రూ.5,000/-


శ్రీమతి కె.శోభ
హైదరాబాద్


శ్రీ వై.రామిరెడ్డి
హైదరాబాద్


శ్రీ సి.హెచ్.నిఖిల్ కృష్ణ
గుంటూరు


శ్రీ ఆర్.వి.రమణ
హైదరాబాద్


శ్రీమతి ఆర్.అంజమ్మ
హైదరాబాద్



శ్రీ డి.వంశీకృష్ణ
హైదరాబాద్



శ్రీమతి బి.సువర్ణ
కరీంనగర్


శ్రీ టి.రామప్రకాశ్
హైదరాబాద్



ఎస్.మేఘన
వైజాగ్


ఆర్.సూర్య చైతన్య
హైదరాబాద్


శ్రీ వి.కరుణాకర్
హైదరాబాద్


శ్రీ పి.యాదగిరి
హైదరాబాద్



శ్రీ జి.వి.బాపురావు
కరీంనగర్


శ్రీ ఎ.ఆంజనేయులు
మహబూబ్‌నగర్


శ్రీ వి.యాదయ్య
హైదరాబాద్


శ్రీమతి కె.కృష్ణ కుమారి
వైజాగ్


శ్రీ కె.పోచయ్య
హైదరాబాద్



శ్రీ కె.కృష్ణమూర్తి
హనుమకొండ



కుమారి కె.హిరణ్మయి
హైదరాబాద్



చి॥ ఎమ్.శ్రీధృతి
హైదరాబాద్


శ్రీమతి బి.శోభాదేవి
ఆర్మూర్


శ్రీమతి కె.ఝాన్సీ
నెల్లూరు


శ్రీ పి.శ్యామసుందర్
మహబూబ్‌నగర్


శ్రీ వై.వ్యాసరాజు
హైదరాబాద్


శ్రీ కె.పార్థసారధి
వైజాగ్